TGTEL/25/A3603
# కింగ్
డైలీ న్యూస్ పేపర్
King Daily News Paper
PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA
హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 223 సోమవారం, జూన్ 29, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు
అత్యుత్తమమైన సేవలు,
ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.
జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
మా ప్రత్యేకతలు
• అత్యవసర & క్రిటికల్ కేర్
• ప్రమాద సేవలు
• ప్రస్తూతి & గైనకాలజీ
• ఆర్థోపెడిక్స్
• జాయింట్ రీప్లేస్‌మెంట్స్
• జనరల్ మెడిసిన్
• జనరల్ సర్జరీ
• మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
• పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
• న్యూరాలజీ • న్యూరోసర్జరీ
• ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
• యూరాలజీ • డెర్మటాలజీ
• సైకియాట్రీ • ఫిజియోథెరపీ


నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ
అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్
+91 85230 89599 +91 86889 09384
www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

# ఒట్టేసి చెబుతున్నా.. మూసీ ప్రక్షాళన తథ్యం



- **తెలంగాణ కోసం ఎవరేమిచేశారో శాసనసభలో మాట్లాడదాం**
- **మూడు పార్టీల పాలనపై రచ్చబండలో చర్చ పెట్టండి**
- **ఏం త్యాగాలు చేశారని భారాసను ప్రజలు కోరుకుంటున్నారు**
- **నల్గొండ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**
- **రూ.13,006 కోట్లతో 6,092 కి.మీ. హ్యామ్ రోడ్ల పనులకు భూమి పూజ**

హైదరాబాద్, నల్గొండ: "ఎన్ని ఆటంకాలు ఎదురైనా దేశానికి తలమానికంగా మూసీని ప్రక్షాళన చేస్తాం. కాలుష్యం నుంచి నల్గొండ బిడ్డలకు విముక్తి కలిగిస్తాం. ఒట్టేసి చెబుతున్నా. మూసీ ప్రక్షాళన తథ్యం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13,006 కోట్లతో 6,092 కిలోమీటర్ల మేర నిర్మించనున్న 441 హ్యామ్ రోడ్ల పనులకు సీఎం ఆదివారం నల్గొండ జిల్లా కనగల్‌లో భూమి పూజ చేశారు. పైలాన్‌ను ఆవిష్కరించారు. నల్గొండ కార్పొరేషన్‌లో రూ.83 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకం పనులకూ శంకుస్థాపన చేశారు. తర్వాత నాగార్జున డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. "బావబామ్మరిది కలిసి తిరుగుతున్నారు. భారాస ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అంటున్నారు. పరీక్ష పేపర్లు అమ్ముకొని రూ.వేల కోట్లు సంపాదించుకున్నందుకు రావాలా? కాళేశ్వరం పేరు మీద రూ.లక్ష కోట్లు కొల్లగొట్టినందుకా? పేదోళ్లకు రేషన్‌కార్డులు అడిగితే స్టేషన్‌లో పెట్టి కొట్టించినందుకా? మీరెందుకు అధికారంలోకి రావాలి. రచ్చబండలో చర్చ పెట్టండి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారు. రెండున్నరేళ్లలో ఏమి తెచ్చారని అడుగుతున్నారు. ఎప్పుడడిగినా ప్రత్యేక శాసనసభ, మండలి సమావేశాలు ఏర్పాటు చేస్తాం. పదేళ్ల భారాస, రెండున్నరేళ్ల కాంగ్రెస్, కేంద్రంలో పన్నెండేళ్ల భాజపా పాలనపై చర్చిద్దాం. అక్కడే తేలుస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెప్పుకోకపోవడం వల్ల ఊరూరా తిరిగి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. సింగరేణిలో టెండర్ కాలేదు.. కొల్లగొట్టారంటున్నారు. గురుకులాల్లో రూ.685 కోట్ల టెండర్లలో రూ.3వేల కోట్లు అక్రమాలు జరిగాయని చెప్పారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా, ఎన్ని నాటకాలు చేసిన తెలంగాణ సమాజం నమ్మదు. రాష్ట్రంలో ప్రజాపాలన వచ్చింది. ప్రజలు సంక్షేమ పథకాలను అనుభవిస్తున్నారు. ఈ తెలంగాణ సమాజం మీ కుటుంబాన్ని శాశ్వతంగా బహిష్కరించింది. 2034 వరకు రాష్ట్రంలో మూడు రంగుల జెండా ఎగురుతుంది.

**నల్గొండ బహిరంగ సభకు హాజరైన జనం**

**ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తాం**

ఎస్ఎల్‌బీసీ పనులను 34 కిలోమీటర్ల మేర పూర్తి చేసి భారాస ప్రభుత్వానికి 10 కిలోమీటర్ల పనులు అప్పగిస్తే పదేళ్లు అలానే ఉంచారు. వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి 3.60 లక్షల ఎకరాల్లో నల్గొండ జిల్లాకు సాగు, తాగునీరు అందిస్తాం. డిండి ప్రాజెక్టును పూర్తి చేస్తాం. నా పాదయాత్ర సమయంలో మూసీ ఇబ్బందులను ప్రజలు వివరించారు. ఆ కాలుష్యంతో ఇబ్రహీంపట్నం, భువనగిరి, మునుగోడు ప్రాంతాలు ఎంతో దారుణంగా ఉన్నాయి. అందుకే మూసీ ప్రక్షాళనకు కంకణం కట్టుకున్నాం. 30 నెలల్లో 70వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వం ఈ దేశంలో ఎక్కడైనా ఉందా అని సవాల్ విసురుతున్నా. శాఖల వారీగా లెక్కలు చెబుతా. శాసనసభకు రండి. నిరుద్యోగుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాం. ప్రజా పాలన ఎందుకు పోవాలి. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్, ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినందుకు, రూ.27వేల కోట్ల రైతు భరోసా ఇచ్చినందుకు ప్రజా పాలన పోవాలా? స్కిల్స్ యూనివర్సిటీ తెచ్చినందుకు పోవాలా? కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయిన ఒక్క సంవత్సరంలో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని ఉత్పత్తి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాం. భారాస పాలనలో ప్రభుత్వ బడికి, ఆసుపత్రికి పోవాలంటే ప్రజలు భయపడేవారు. ఇప్పుడు అదే పాఠశాలల్లో నర్సరీ నుంచి 12 వరకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నాం. తెలంగాణ గురుకులాలు వందల మంది అంబేడ్కర్‌లను తయారు చేయాలనే టమొక్కవోని ధైర్యంతో ముందుకు పోతున్నాం. ఆరుట్ల పాఠశాల ప్రారంభోత్సవానికి వెళ్లాక నాకు సంపూర్ణ విశ్వాసం వచ్చింది. మా ప్రభుత్వ ఉపాధ్యాయులు మేం గర్వంతో తలెత్తుకునే విధంగా విద్యార్థులను తయారు చేస్తున్నారు.

**ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే కడుపు మంట ఎందుకు?**

ఐదు సంవత్సరాలు భారాస మంత్రి వర్గంలో ఒక్క ఆడబిడ్డ అయినా ఉందా? పదేళ్లలో రేషన్‌కార్డు ఇవ్వలేదు. మా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడు లక్షల మంది పేదలకు రేషన్‌కార్డు అందించింది వాస్తవం కాదా? ఆర్థికంగా భారమైనా పేదవారి కడుపు నింపాలని రూ.16 వేల కోట్లతో 3.28 కోట్లమంది పేదలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నాం. మీరు గజ్వేల్‌లో ఫాంహౌస్ కట్టుకోవచ్చు. కుమార్తె, కుమారుడు, అల్లుడు రూ.వందల కోట్లు పెట్టి ఫాంహౌస్‌లు నిర్మించుకోవచ్చు. పేదోళ్లకు రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే మీకు కడుపు మంట ఎందుకు? ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల చొప్పున ఉచితంగా ఇస్తున్నాం?" అని రేవంత్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, సామేల్, వేముల వీరేశం, అనిల్‌కుమార్‌రెడ్డి, పద్మావతి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, కోటిరెడ్డి, సత్యం, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ పాల్గొన్నారు.

**రూ.172 కోట్ల చెక్కు అందజేత**

నల్గొండ: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం జిల్లాలో వడ్డీలేని రుణాలకు సంబంధించి రూ.172 కోట్ల చెక్కును సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మహిళలకు అందజేశారు. నల్గొండ నగరపాలక సంస్థ పరిధిలోని మహిళలకు మెప్మా అధ్వర్యంలో రూ.11 కోట్ల చెక్కులను పొదుపు సంఘాల మహిళలకు సీఎం పంపిణీ చేశారు.



# వారిది అహంకార ధోరణి

**- మల్లు భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి**



ఆనాటి ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలను పదేళ్లపాటు చిత్రహింసలకు గురి చేసింది. అహంకార ధోరణితో ప్రజా పోరాట కార్యక్రమాలను అణచివేసింది. భారాస ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్మరిస్తే మేం అధికారంలోకి వచ్చాక 90% శాతం పూర్తి చేశాం. మహిళలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం. రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నాం. రహదారుల నిర్మాణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఇంత పెద్దఎత్తున చేపట్టిన ప్రభుత్వం మాదే.

# భారాస.. హెచ్‌ఆర్‌ఎస్ అవుతుందేమో

**- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రహదారులు, భవనాలశాఖ మంత్రి**



భారాస పూటకో పార్టీ పేరుతో ప్రజలను మోసం చేస్తుంది. మొన్న టీఆర్ఆఎస్.. నేడు భారాస.. రేపు హెచ్‌ఆర్‌ఎస్ (హరీశ్‌రావు రాష్ట్ర సమితి)గా మారుస్తారేమో! బావబామ్మర్దులు (హరీశ్‌రావు, కేటీఆర్) టెండర్లు ప్రారంభించక ముందే 'హ్యామ్-స్కామ్' అంటూ హడావుడి చేస్తున్నారు. తెలంగాణలో రహదారులు అధ్వానంగా ఉండటంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతుండటంతో.. రూ.6,500 కోట్లు రాష్ట్ర నిధుల నుంచి మంజూరు చేసి రహదారుల అభివృద్ధికి సీఎం చొరవ చూపారు. హ్యామ్ పథకం ద్వారా రూ.13 వేల కోట్లు ఆర్‌అండ్‌బీ నుంచి, రూ.7వేల కోట్లు పంచాయతీరాజ్ శాఖ నుంచి కేటాయించాం. రూ.10,400 కోట్లతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరులైన్లుగా విస్తరించేందుకు టెండర్లు పిలిచాం. కనగల్ మండలం నుంచి గుర్రంపోడ్ అటు నుంచి బందరు, అమరావతి మీదుగా 300 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు డీపీఆర్ పనులు పూర్తి చేశాం. మొత్తం జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారుల నిర్మాణానికి గరిష్ఠంగా రూ.78వేల కోట్లు కేటాయించి దశలవారీగా అభివృద్ధి చేస్తున్నాం.

# రైతులకు రూ.19,313 కోట్లు చెల్లించాం

**- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి**



ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలకు తాగు, సాగునీటిని సమృద్ధిగా అందిస్తాం. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, కాలువల ఆధునీకరణ పనులతో పాటు బస్వాపూర్, గంధమల్ల, బునాదిగాని ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వచ్చే ఏడాది లోగా పెండింగ్ పనులు పూర్తి చేస్తాం. దేశంలోనే రెండు పంట కాలాలు కలిపి 152 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. యాసంగిలో 81లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొని రూ.19,313 కోట్లు రైతులకు చెల్లించాం.

# మూడు రెట్లు కి పైగా పెరిగిన భీమ్ పేమెంట్స్ యాప్ లావాదేవీలు



నల్గొండ:-నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బీమ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్ బీఎస్ఎల్) నుంచి వచ్చిన బీమ్ పేమెంట్స్ యాప్ గత 12 నెలల్లో బలమైన వృద్ధిని నమోదు చేసింది. ఈ సందర్భంగా ఎన్పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్బీఎస్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ లలిత నటరాజ్ మాట్లాడుతూ జూన్ 2025 నుండి మే 2026 వరకు ఈ యాప్‌లో జరిగిన లావాదేవీల పరిమాణం మూడు రెట్లకు పైగా పెరిగిందని, యాప్‌లో నెలవారీ లావాదేవీల సంఖ్య జూన్ 2025లో 7.964 కోట్ల (79.64 మిలియన్లు) నుండి మే 2026 నాటికి 24.4 కోట్ల (244 మిలియన్లు) లావాదేవీలకు పెరిగిందన్నారు. మే 2026లో ఈ వేదిక ద్వారా మొత్తం రూ. 26,952 కోట్ల విలువైన లావాదేవీలు ప్రాసెస్ చేయబడ్డాయి. ఇది దేశవ్యాప్తంగా రోజువారీ చెల్లింపుల కోసం డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరుగుతున్నదానికి నిదర్శనంగా నిలుస్తోందని చెప్పారు. తెలంగాణలో భీమ్ పేమెంట్స్ యాప్ వృద్ధి దేశవ్యాప్తంగా కనిపిస్తున్న ధోరణిని ప్రతిబింబిస్తోందన్నారు. జూన్ 2025 నుండి మే 2026 వరకు లావాదేవీల పరిమాణం మూడు రెట్లు పెరిగింది. మే 2026లో రాష్ట్రంలో ఈ వేదికపై జరిగిన వ్యాపారుల (మర్చంట్) లావాదేవీలలో కిరాణా సరుకుల విభాగం 23.9 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఫుడ్ అవుట్‌లెట్లు 18.1 శాతం మరియు క్విక్ కామర్స్ 11.6 శాతం వాటా సాధించాయన్నారు. ఇతర ముఖ్యమైన విభాగాల్లో డెయిరీ మరియు బేకరీలు (3.2శాతం), ఇంధన కేంద్రాలు (2.8 శాతం ), ఈ-కామర్స్ (2.2 శాతం ), మరియు ప్రభుత్వ సేవలు (2.0 శాతం) ఉన్నాయని, ఇవి రోజువారీ ఖర్చుల్లో డిజిటల్ చెల్లింపుల ప్రాధాన్యం మరింత పెరుగుతున్నదాన్ని సూచిస్తున్నాయన్నారు. అలాగే, రాష్ట్రంలో యూపీఐ లైట్ మరియు రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐ వంటి వినూత్న చెల్లింపు సౌకర్యాల వినియోగం కూడా పెరుగుతోందని, ఇది వినియోగదారులు మరింత సులభమైన, నిరంతరాయమైన మరియు క్రెడిట్ ఆధారిత చెల్లింపు ఎంపికలను ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారని సూచిస్తోందన్నారు.

తెలంగాణలో భీమ్ పేమెంట్స్ యాప్ సాధించిన బలమైన వృద్ధి, డిజిటల్ చెల్లింపులు ప్రజల రోజువారీ జీవితంలో మరింతగా భాగమవుతున్నాయనే విషయాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ముఖ్యంగా, కిరాణా సరుకులు, ఫుడ్ అవుట్‌లెట్లు మరియు క్విక్ కామర్స్ వంటి విభాగాల్లో జరుగుతున్న లావాదేవీలు ఈ వృద్ధికి ప్రధాన కారణంగా ఉండటం ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది. ఇది సాధారణ రోజువారీ ఖర్చుల కోసం డిజిటల్ చెల్లింపుల వైపు వినియోగదారులు మరింతగా మొగ్గు చూపుతున్నారని సూచిస్తోంది. వినియోగదారులు మరింత సౌకర్యవంతమైన చెల్లింపు అనుభవాలను స్వీకరిస్తున్న ఈ సమయంలో, ప్రతి ఒక్కరికీ సులభమైన, నిరంతరాయమైన మరియు అందుబాటులో ఉండే పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై మేము దృష్టి సారిస్తున్నాము" అని తెలిపారు.

# సంపాదకీయం

**సోమవారం, జూన్ 29, 2026**

## వాషింగ్ మెఃషిన్ గా మారుతున్న అధికార పక్షం

ఎమర్జెన్సీని ప్రకటించి 51 సంవత్సరాలు గడిచినా, భారతదేశం తన ప్రజాస్వామ్య చరిత్రలోని అత్యంత వివాదాస్పద అధ్యాయాలలో ఒకదానిపై చర్చను కొనసాగిస్తోంది. ఆ చర్చ సమంజసమే కావచ్చు. ఎమర్జెన్సీ పరిశీలన, విమర్శ, చారిత్రక పరిశీలనకు అర్హమైనది. అయితే, ప్రజలు, చరిత్ర రెండూ ఎప్పుడో తీర్పు వెలువరించిన ఒక చారిత్రక సంఘటనగా కాకుండా, భారతీయ జనతా పార్టీ దీనిని ఒక సమకాలీన రాజకీయ సమస్యగా ఎందుకు పరిగణిస్తూనే ఉందనేది అంత సులభంగా అర్థం కాని విషయం. వాస్తవానికి, భారతదేశంలో ప్రజాస్వామ్యం ఇటీవల వెనకడుగు వేయడాన్ని పరిగణనలోకి తీసుకుంటే, అప్రకటిత ఎమర్జెన్సీని విధించింది బిజెపియే. రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడం, ఫిరాయింపులను ప్రోత్సహించడం, మీడియా యాజమాన్యంలోని ఒక పెద్ద విభాగంపై ఉక్కుపిడికిలి బిగించడం, ఆశ్రితపెట్టుబడిదారీ విధానం, సంస్థల గొంతు నొక్కడం, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేయడం – ఇవన్నీ ఎమర్జెన్సీ లక్షణాలు, ఇవి ఇప్పటికీ అమలులో ఉన్నాయి. కాంగ్రెస్ సమకాలీకులలో చాలామంది కూడా, ఎమర్జెన్సీ గురించి లోతుగా పరిశోధించడానికి లేదా చర్చించడానికి తరచుగా ఇబ్బందిపడతారు. ఎమర్జెన్సీ దోషరహితమైనదని కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ వాదించలేదు. దశాబ్దాలుగా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌లతో సహా దాని అగ్ర నాయకత్వం, ఆ కాలంలో జరిగిన దురాగతాలను బహిరంగంగా అంగీకరించింది. ఇందిరా గాంధీ స్వయంగా 1977లో ఎన్నికలు నిర్వహించి ప్రజల తీర్పును కోరారు. ఓడిపోయినప్పుడు ఓటర్ల తీర్పును అంగీకరించారు. ఆమె స్వయంగా మరో వేయేళ్లు వరకు దేశంలో ఎమర్జెన్సీ విధించే పరిస్థితి రాదనీ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నాయకత్వం చరిత్రలోని ఆ అధ్యాయం పట్ల పదేపదే విచారం వ్యక్తం చేసింది. అయినప్పటికీ, ప్రతి సంవత్సరం, ముఖ్యంగా జూన్ 25వ తేదీ చుట్టూ, బిజెపి ఎమర్జెన్సీని ఒక రాజకీయ ఆయుధంగా పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తుంది. దీని ఉద్దేశం చారిత్రక పరిశీలన కాదు. ఇది ఒక రాజకీయ సమీకరణ. తన వర్తమానంపై విశ్వాసం ఉన్న ప్రభుత్వం, తన పరిపాలన ద్వారా ప్రజల మెప్పు పొందగలమని ఆత్మవిశ్వాసం గల ప్రభుత్వం, దాదాపు అర్థ శతాబ్దం క్రితం ఉనికిలో లేకుండాపోయిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతరం ప్రచారం చేయవలసిన అవసరం ఉండదు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వం మారగానే ఇటీవల కోల్‌కతా అంతటా జరిగిన కూల్చివేతల పరంపర ఎమెర్జెన్సీ నాటి దారుణమైన రోజులను గుర్తుకు తెచ్చింది. సీల్దా, హౌరా, దమ్ దమ్, జాదవ్‌పూర్, ఇతర ప్రాంతాలలో తోపుడు బండ్ల వ్యాపారులు, చిన్న వ్యాపారులు, విక్రయదారులు, మురికివాడల నివాసితుల జీవనోపాధిని నాశనం చేసింది. అధికారులు 'అభివృద్ధి', 'సుందరీకరణ' అని పిలిచేది, వాస్తవానికి, శ్రామిక కుటుంబాలు దశాబ్దాలుగా చెమటోడ్చి నిర్మించుకున్న ఇళ్లను, వ్యాపారాలను రాత్రికి రాత్రే కూల్చివేయడమే. మే 16– 17 తేదీల రాత్రి, రైల్వే అధికారులు, భద్రతా దళాలు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సీల్దా స్టేషన్‌లోని కియోస్కులు, స్టాల్స్‌ను కూల్చివేశారు. ఇదే తరహా చర్యలు మే 16న హౌరాలో, మే 31 రాత్రి దమ్ దమ్ జంక్షన్‌లో, జూన్ 7– 8 తేదీల రాత్రి జాదవ్‌పూర్‌లో జరిగాయి. జాదవ్‌పూర్‌లో, వీధి వ్యాపారులు, విద్యార్థులు, కార్మిక సంఘాల కార్యకర్తలు బుల్డోజర్ల ముందు శాంతియుతంగా కూర్చున్నప్పుడు, వారిపై లాఠీచార్జీలు, అరెస్టులు జరిగాయి. వృద్ధ వీధి వ్యాపారులు తమ జీవితపు ఆనవాళ్ల కోసం శిథిలాలలో వెతుక్కోవాల్సి వచ్చింది. కార్మికులకు సంఘీభావం తెలిపినందుకు విద్యార్థులు, కార్యకర్తలను కొట్టారు. ప్రభావిత వర్గాలు చర్చలకు వెళ్ళినప్పుడు, వారిని పట్టించుకోలేదు. వారి డిమాండ్ చాలా సరళమైనది: ఉత్తరప్రదేశ్ నుండి మధ్యప్రదేశ్ మీదుగా రాజస్థాన్ వరకు, కూల్చివేత చర్యలను పట్టణ ప్రణాళిక సాధనాలుగా కాకుండా, ప్రభుత్వ ఆధిపత్య ప్రదర్శనలుగా ప్రయోగించారు. ఇవి ప్రధానంగా శ్రామిక పేదలు, వలస కార్మికులు, అసంఘటిత కార్మికులను (తరచుగా మైనారిటీలు) లక్ష్యంగా చేసుకున్నాయి. వీరికి ప్రతిఘటించడానికి అతి తక్కువ వనరులు, అతి తక్కువ రాజకీయ రక్షణ ఉంటాయి. ప్రయోగించిన ప్రతి బుల్డోజర్‌తో, తాను పనికిరానివారిగా భావించిన వారిపై బలాన్ని ప్రయోగించడానికి సిద్ధంగా ఉన్నానని బిజెపి తన 'బేస్'కు సంకేతం ఇస్తుంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా ఒక వర్గం వారి ఇల్లు లేదా జీవనోపాధి రాత్రికి రాత్రే తుడిచిపెట్టుకుపోయిన ప్రతిసారీ ప్రజాస్వామ్య జవాబుదారీతనం క్షీణిస్తుంది. గత ఐదేళ్లలో భారతదేశవ్యాప్తంగా కూల్చివేతలు 379% పెరిగాయని పరిశోధనా సంస్థలు నమోదు చేశాయి. నేడు అధికార కేంద్రీకరణ శృతిమించిపోతుంది. ప్రజాస్వామ్యంలో నిరసనలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం కీలకం. అయితే, కీలక నిర్ణయాల విషయంలో సహితం మంత్రివర్గంలో కూడా సవివరంగా చర్చలు ఉండటం లేదు. అధికార పక్షం 'వాషింగ్ మెషిన్'గా మారిపోయింది. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం కావించడమే కాగలదు. ఎమెర్జెన్సీలో మాదిరిగా న్యాయవ్యవస్థ సైతం నిస్సహాయంగా ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతుంది.

**- ఎడిటర్**

## ఆదానీ లంచం కేసులో ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం

### కేసు ఉపసహంరణకు నివేదిక ఇవ్వాలని జడ్జి ఆదేశం

న్యూయార్క్,జూన్: బిలియనీర్ గౌతమ్ అదానీ పై నమోదైన హై-ప్రొఫైల్ లంచం కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీతోపాటు ఇతర నిందితులపై ఉన్న క్రిమినల్ ఆరోపణ లను తక్షణమే కొట్టివేసేం దుకు ఫెడరల్ జడ్జి నిరాక రించారు. ఈ కేసును ఎందుకు ఉపసంహరి ంచుకోవాలని అనుకుంటున్నారో తెలుపుతూ మరింత స్పష్టమైన, వివరణాత్మకమైన నివేదికను సమర్పించా లని అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్‌ను కోర్టు ఆదేశించింది. బ్రూక్లిన్ లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గరాఫిస్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కేసును ఉపసంహరించుకోవాలంటూ మే 18న జస్టిస్ డిపార్ట్‌మెంట్ దాఖలు చేసిన పిటిషన్ చాలా క్లుప్తంగా, ఎలాంటి బలమైన కారణాలు లేకుండా ఉందంటూ ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. కేసును ఎందుకు డ్రాప్ చేయాలనుకుంటున్నారో సరైన ఆధారాలు, కారణాలతో కూడిన నివేదికను జూలై 13 లోగా కోర్టుకు సమర్పించాలని ప్రాసిక్యూటర్లను ఆదేశించారు. భారత్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఆమోదం కోసం ప్రభుత్వ అధికారులకు వందల మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించారని, అలాగే అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారని గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై 2024లో అమెరికాలో కేసు నమోదైంది. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కేసుపై మరింత సమయం, వనరులను కేటాయించలేమని పేర్కొంటూ కేసును పూర్తిగా ఉపసంహరించుకోవాలని జస్టిస్ డిపార్ట్‌మెంట్ భావించింది. జూన్ 24న అదానీ తరపు న్యాయవాదులు కూడా ఈ కేసు అమెరికా అధికార పరిధిలోకి రాదని, లంచం ఇచ్చినట్లు నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును అధికారికంగా కొట్టివేయాలని కోర్టును కోరారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం నుంచి పూర్తి వివరణ కావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు. ఈ క్రిమినల్ కేసు పక్రియ ఇలా ఉండగా.. దీనికి సమాంతరంగా నడుస్తున్న సివిల్ వివాదాల పరిష్కారానికి అదానీ గ్రూప్ అంగీకరించింది. ఇందులో భాగంగా గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్ల మేర సివిల్ సెటిల్‌మెంట్ కింద చెల్లించే ప్రతిపాదనలు కోర్టు అనుమతి కోసం వేచి ఉన్నాయి. ఇవి కాకుండా ఇరాన్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ దిగుమతులకు సంబంధించి అమెరికా ఆంక్షలను ఉల్లంఘించారనే ఆరోపణల పరిష్కారానికిగాను అదానీ ఎంటర్‌ప్రైజెస్ అమెరికా ట్రెజరీకి 275 మిలియన్ డాలర్లు చెల్లించడానికి ఒప్పుకుంది.

## తక్కువ ధరకు బంగారం అంటూ బురిడీ

### పారిపోతుండగా సూర్యాభాయ్ అరెస్ట్

హైదరాబాద్,జూన్ : గోల్డ్ మ్యాన్ సూర్యభాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ అమాయకులను సూర్య భాయ్ బురిడీ కొట్టించాడు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే.. ఏకంగా బాధితులపై కేసు పెట్టాడు. చివరకు అసలు రంగు బయటపడటంతో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా గోల్డ్ మ్యాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తక్కువ ధరకే విదేశీ బంగారం ఇస్తానంటూ అమాయకుల నుంచి సూర్య భాయ్ లక్షలాది రూపాయలను వసూలు చేసి భారీ మోసానికి తెరతీశాడు. గోల్డ్ మ్యాన్ మాటలు నమ్మి హిమాయత్‌నగర్, నీలోఫర్‌కు చెందిన బాధితులు దాదాపు రూ.30 లక్షలు ఇచ్చారు. అయితే బంగారం ఇవ్వకపోవడంతో సూర్య ఇంటికి వెళ్లిన బాధితులు.. తమ డబ్బులు తమకు తిరిగి ఇచ్చేయాలని కోరారు. దీంతో తన వద్ద ఉన్న మూడు ఐఫోన్లను ఇచ్చి వాటి విలువ రూ.10 లక్షలు అని, అలాగే రూ.20 లక్షల చెక్ ఇచ్చి బాధితులను పంపించేశాడు. అనంతరం బాధతులపైనే సూర్య భాయ్ తిరిగి పోలీసులకు ఫిర్యాదు చేశాను. తనను బెదిరించి ఫోన్ లాక్కెల్లారంటూ సూర్య భాయ్ పోలీసులను తెలిపారు. ఈ విషయంలో లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు అసలు నిజామన్ని బయటపెట్టారు. తక్కువ ధరకే బంగారం పేరుతో సూర్య భాయ్ మోసం చేశారంటూ అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును నారాయణగూడకు బదిలీ చేశారు. అయితే అరెస్ట్ భయంతో సూర్య భాయ్ హైదరాబాద్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా షాద్‌నగర్‌లో పోలీసులు పట్టుకున్నారు.

## నేడు పల్స్ పోలియో కార్యక్రమం

### చిన్నారులకు పోలియో చుక్కలకు ఏర్పాట్లు

హైదరాబాద్,జూన్ : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ ఆదివారం పల్స్ పోలియో నిర్వహించనున్నారు. అయిదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.



రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని నవజాత శిశువులు మొదలుకుని 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. జూన్ 28న రాష్ట్రవ్యాప్తంగా పోలియో బూత్‌లలో డ్రాప్స్ వేస్తారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగతా చిన్నారులకూ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో జులై 1న అదనంగా మరో రోజు కార్యక్రమం కొనసాగుతుంది. ఇకపోతే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇప్పటికే ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఒక్కరు కూడా మిగిలిపోకుండా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు, , గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని, పోలియో రహిత హోదాను ఉమ్మడి రాష్ట్రంలోనే సాధించామని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు.

## ముగ్గురు సిఎంలు ఏం మాట్లాడుకున్నారు ?

### ఆ చీకటి ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పండి

### తెలంగాణ హక్కలుకు భంగం వాటిల్లేలా రేవంత్ నిర్ణయాలు

### మరోమారు విమర్శలు గుప్పించిన హరీష్ రావు

హైదరాబాద్,జూన్ :ఇటీవల కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన చీకటి ఒప్పందాలు ఏంటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో మూడు రాష్ట్రాల సీఎంలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురే కూర్చుని ఏం ఒప్పందాలు చేసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఏపీలో గుండ్రేవుల ప్రాజెక్టులు కడతామంటుంటే మన ముఖ్యమంత్రి చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులకు నీళ్లు ఇవ్వబోమని ట్రిబ్యునల్ చెప్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని రానీయకుండా అడ్డుకున్నామని, కానీ ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రి తన శిష్యుడైన తెలంగాణలో సీఎం అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఆర్‌డీఎస్‌కు పక్కా నీటి కేటాయింపులపై ఏమైనా స్పష్టమైన హామీ వచ్చిందా అని ప్రశ్నిస్తూ, రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కాంప్రమైజ్ అయినా బీఆర్ఎస్ అస్సలు ఒప్పుకోదని స్పష్టం చేశారు.

## వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌కు ట్రంప్

### ధృవీకరించిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో

### భారత్ -యూఎస్ బంధం బలోపేతం అంటూ కితాబు

వాషింగ్టన్,జూ౹:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో వెల్లడించారు. ట్రంప్ భారత్ పర్యటన కోసం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించామని, ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షిస్తానని తెలిపారు. భారత్–అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ– ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీ–ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్–అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై రూబియో ప్రశంసలు కురిపించారు. తాను ఆయనకు అభిమానినని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ స్థాయిని పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మోదీ భారత్‌ను ఒక ప్రపంచ శక్తిగా మార్చారని కొనియాడారు. భారత్–అమెరికా బంధం ప్రస్తుతం ఎంతో బలంగా ఉందని మార్కో రుబియో పేర్కొన్నారు. వైట్ హౌస్‌లో ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రుబియో మాట్లాడారు. 'వచ్చే ఏడాది ప్రారంభంలో అధ్యక్షుడు ట్రంప్, భారత్ పర్యటనకు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. అదే మా లక్ష్యం' అని చెప్పారు. అలాగే, అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేస్తోందని వ్యాఖ్యానించారు. లాగే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని కూడా రుబియో తెలిపారు . ఈ ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనివల్ల భారత్–అమెరికా ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే క్వాడ్ దేశాల నేతల సమావేశం కూడా త్వరలో నిర్వహించాలని అమెరికా ఎదురుచూస్తోందని చెప్పారు.

## హైదరాబాద్‌లో డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ

### భారత్‌కు కృతజ్ఞతలు అంటూ ట్రూత్‌తో ట్రంప్ వెల్లడి



వాషింగ్టన్,: భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కనున్న రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' అని పేరు పెట్టిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'ఈ విధంగా గౌరవం పొందిన అమెరికా తొలి అధ్యక్షుడిని నేను. ధన్యవాదాలు భారత్' అంటూ ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో పోస్టు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న హైదరాబాద్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ పక్కన ఉన్న రోడ్డుకు 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేశారు. ఆ ప్రత్యేక ఫలకాన్ని అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో కలిసి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆవిష్కరించారు. మెరికాకు చెందిన కీలక టెక్ కంపెనీలు అయిన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్‌లు ఈ రోడ్డుకు దగ్గర్లోనే ఉన్నాయి. ఈ పేరు మార్పును తెలంగాణ ప్రభుత్వం భారత్–అమెరికా సంబంధాలకు గుర్తింపుగా, అలాగే హైదరాబాద్ అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో తీసుకున్న ప్రతీకాత్మక నిర్ణయంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ధన్యవాదాలు తెలియజేశారు.

## గుట్ట ఇవోగా మరో ఏడాది పాటు భవానీ శంకర్

### పదవీకాలాన్ని పొడిగించిన ప్రభుత్వం

యాదగిరిగుట్ట,: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కార్యనిర్వహణ అధికారి భవానీశంకర్ మరో ఏడాదిపాటు కొనసాగనున్నారు. ఆయన ఇవోగా ఈ నెల 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని ఏడాది పొడిగించింది. ఇవో పదవీ కాలాన్ని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30న ఆయన పదవీ విరమణ పొందుతుండటంతో ఆయన పదవీకాలంలో మరోఏడాది వరకు పొడిగించిన్నట్లు వెల్లడించారు. 2027 జూన్ 30 వరకు ఆయన దేవస్థాన ఈవోగా కొనసాగుతారని స్పష్టం చేశారు. పదవీ విరమణ పొందే వరకు పొందిన వేతనంలో పింఛన్ మినహాయించగా మిగిలిన మొత్తం ఆధారంగా వేతనాన్ని నిర్ణయించిన్నట్లు చెప్పారు. గతంలో గవర్నర్‌కు జాయింట్ సెక్రెటరీగా పని చేసిన భవానీశంకర్‌ను దేవస్థాన ఈవోగా నియమిస్తూ ఈ ఏడాది జనవరి 17న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయగా అదే నెల 29న పదవీ బాధ్యతలు స్వీకరించారు. తాజాగా మరోసారి ఆయన ఈవో [redacted] కరుకు పేర [redacted]

# శంషాబాద్‌ల ప్రాంతంలో చిరుత సంచారం

### స్థానికుల సమాచారంతో అధికారుల వేట

హైదరాబాద్,జూన్: హైదరాబాద్‌లోని శంషాబాద్ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లోని చిన్మయ స్కూల్ సమీపంలో చిరుత కనిపించిందంటూ స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. చిరుత ఆనవాళు ్ల, పాదముద్రలు లేదా ఇతర ఆధారాలు ఉన్నాయా అనే దానిపై అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అవసరమైతే ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. చిరుత కనిపించిందనే వార్తతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా స్కూల్ పరిసర ప్రాంతాలు, నివాస కాలనీల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అయితే ఇప్పటివరకు చిరుత సంచారంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, చిరుత ఆనవాళ్లు లభించిన తర్వాతే స్పష్టమైన సమాచారం అందజేస్తామని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా, ఏదైనా అనుమానాస్పద జంతువు కనిపిస్తే వెంటనే అటవీశాఖ లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# స్ ఐ ర్ ప్రక్రియ ను పర్యవేక్షించిన అడిషనల్ కలెక్టర్



కరీంనగర్ :చొప్పదండి మండలం రుక్మాపూర్, కొలిమికుంట గ్రామాలలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ(రాఎఖీ) ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ ( స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బి.ఎల్.వోలు ఇంటింటికి వెళ్లి ఎస్.ఐ.ఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని, ఉన్నతాధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు.

# బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం

### మేకను ఎత్తుకెళ్లిందంటున్న గ్రామస్థులు

నిజామాబాద్,జూన్ : జుక్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో మేత మేస్తున్న గొర్రెల గుంపులోకి వచ్చిన చిరుత.. ఓ మేకపిల్లను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అక్కడ కనిపించిన అడుగుజాడలను పరిశీలించి అవి చిరుత పాదాలేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రైతులు, పశువుల కాపరులు, గ్రామ ప్రజలు ఒంటరిగా పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనిపించినా లేదా ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైతే చిరుతను బంధించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

# అమీనాపూర్‌లో మహిళ, ఇద్దరు పిల్లలతో అదృశ్యం

### జాగదొరక్కపోవడంతో కటుఉంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు

నిజామాబాద్,జూన్ :వేల్పూర్ మండలం అమీనాపూర్‌లో మహిళ సహా ఇద్దరు చిన్నారులు అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఓ మహిళ తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడం సంచలనం సృష్టిస్తోంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న వేల్పూర్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇద్దరు పిల్లలతో సదరు మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే రాత్రి అయినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. మహిళ సెల్‌ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినా స్విచ్ఆఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎంత వెతికినా ఎక్కడా ఆమె జాడ తెలియరాలేదు. దీంతో బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి వేల్పూర్ పోలీసులను బాధిత కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మహిళ, చిన్నారుల ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. వారి వివరాలు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని వేల్పూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# మలుపులు తిరుగుతున్న మెట్రో.



హైదరాబాద్, జూన్ , హైదరాబాద్ లాంటి అంతర్జాతీయ మహానగరానికి ప్రజా రవాణా వ్యవస్థలో గుండెకాయ లాంటి మెట్రో రైలు ప్రాజెక్టు ఇప్పుడు పూర్తి ప్రభుత్వ పరం కావాల్సిన కీలక తరుణంలో సరికొత్త మలుపులు తిరుగుతోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో ఈ ప్రాజెక్టును నిర్మించి, నిర్వహిస్తున్న నిర్మాణ దిగ్గజం ఎల్అండ్‌టీ దీని నుండి పూర్తిగా తప్పుకుంది. అయితే, ఎల్అండ్‌టీ నుంచి మెట్రో ఫేజ్-1 టేకోవర్ ప్రక్రియ ఇప్పటికే నత్తనడకన సాగుతుండగా, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తాజా ఢిల్లీ చర్చల తర్వాత రంగంలోకి దేశీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ క్యాప్స్ రావడం ప్రాజెక్టు భవితవ్యంపై తీవ్ర ఆసక్తితో పాటు పలు ఆందోళనలను రేకెత్తిస్తోంది.ఢిల్లీ వేదికగా జరిగిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఈ ప్రాజెక్టు వాల్యుయేషన్ బాధ్యతలను ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించారు. ఎల్అండ్‌టీ సంస్థ మెట్రో ప్రాజెక్టు కోసం చేసిన అప్పులు, సేకరించిన నిధులు, రియల్ ఎస్టేట్ ద్వారా వస్తున్న ఆదాయం , ప్రస్తుతం ప్రాజెక్ట్ విలువ ఎంత ఉందనే దానిపై ఎస్‌బీఐ క్యాప్స్ ఒక నిష్పాక్షికమైన నివేదిక ఇవ్వనుంది. దీని ఆధారంగానే తెలంగాణ ప్రభుత్వం ఎల్అండ్‌టీకి ఎంత పరిహారం చెల్లించి ప్రాజెక్టును తన చేతుల్లోకి తీసుకోవాలనేది ఖరారవుతుంది. అయితే, ఈ ప్రక్రియ వల్ల మెట్రో సమస్య త్వరగా పరిష్కారమవుతుందా లేదా వాల్యుయేషన్ల లొసుగులతో మరింత కాలయాపన జరిగి మొదటికే వస్తుందా అనే సందిగ్ధత నెలకొందిరోజుకు దాదాపు 5 లక్షల మందికి పైగా ప్రయాణికులను చేరవేస్తున్నప్పటికీ హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 ఆశించిన స్థాయిలో లాభాలను తీసుకురావడం లేదు. కోవిడ్ లాక్‌డౌన్ దెబ్బ, కా ఐటీ కారిడార్‌లో ఆక్యుపెన్సీ హెచ్చుతగ్గుల వల్ల ఎల్అండ్‌టీ సంస్థ భారీగా నష్టాలను చవిచూసింది. ఇప్పటికే ఇచ్చిన రూ. 3,000 కోట్ల సాఫ్ట్ లోన్ కూడా సంస్థను పూర్తి గట్టెక్కించలేకపోయింది. దీంతో తమ కోర్ బిజినెస్ పైనే దృష్టి పెట్టాలని, మెట్రో లాంటి భారీ రాయితీ ప్రాజెక్టుల నుండి గౌరవప్రదంగా తప్పుకోవాలని ఎల్అండ్‌టీ భావిస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా సింగిల్ హ్యాండ్‌తో టేకోవర్ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇందుకు కొన్ని కఠిన నిబంధనలు పెడుతోంది. ఢిల్లీ, బెంగళూరు మెట్రో తరహాలోనే హైదరాబాద్ మెట్రోను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 50:50 జాయింట్ వెంచర్ మోడల్‌లోకి మార్చాలని కేంద్రం సూచిస్తోంది. ఈ వ్యూహాత్మక మార్పుకు అంగీకరిస్తే కేంద్రం నుండి నిధుల లభ్యత సులువవుతుంది కానీ, పూర్తి నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వ చేతుల్లో ఉండదు. ఫేజ్-1 టేకోవర్ వివాదం ఒక కొలిక్కి రాకపోతే, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణ పనులపై ఆ ప్రభావం పడక తప్పదు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రూట్, నాగోల్-ఎల్బీనగర్ కనెక్టివిటీ, శేరిలింగంపల్లి కారిడార్ల విస్తరణకు వందల కోట్లు అవసరమవుతాయి. పాత లయబిలిటీస్ ఎవరు తీర్చాలనే స్పష్టత లేకపోతే, అంతర్జాతీయ బ్యాంకులైన జైకా , ఏడీబీ ల నుండి కొత్త ప్రాజెక్టులకు రుణాలు రావడం కష్టతరంగా మారుతుంది. ప్రస్తుతానికైతే హైదరాబాద్ మెట్రో భవితవ్యం పూర్తిగా ఎస్‌బీఐ క్యాప్స్ ఇవ్వబోయే ఫైనాన్షియల్ అసెస్‌మెంట్ నివేదికపైనే ఆధారపడి ఉంది. ఎల్అండ్‌టీ ఆశిస్తున్న కమర్షియల్ సెటిల్‌మెంట్‌కు, రాష్ట్ర ప్రభుత్వం భరించగలిగే బడ్జెట్ పరిమితులకు మధ్య ఎస్‌బీఐ క్యాప్స్ ఎలాంటి రాజీ ఫార్ములాను ప్రతిపాదిస్తుందనేది ఇక్కడ అత్యంత కీలకం.

# సెంటిమెంట్ విఫల వ్యూహం..

## జనం లైట్ తీసుకుంటున్నారా?

హైదరాబాద్, జూన్ , తెలంగాణ రాజకీయ చిత్రపటంపై సరికొత్త వ్యూహాలు, సమీకరణాలు ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న విమర్శలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. తెలంగాణ ప్రాంతీయవాదాన్ని పవన్ అవమానించారంటూ ఆయనపై దేశద్రోహం కేసులు పెట్టాలనే డిమాండ్ల వరకు కవిత వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ప్రస్తుతం తన రాజకీయ అస్తిత్వాన్ని, కొత్త పార్టీ ఉనికిని చాటుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రగిల్చడం ద్వారా ప్రజాదరణ పొందవచ్చని ఆమె భావిస్తున్నారు. ఇందులో భాగంగానే పొరుగు రాష్ట్ర నేత అయిన పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో, ఢిల్లీ లో చేసిన కొన్ని వ్యాఖ్యలను ఆమె తనకు అనుకూలంగా మలచుకోవాలని చూస్తున్నారు. తెలంగాణవాదులను, ప్రాంతీయ అస్తిత్వాన్ని పవన్ కించపరిచారనే భావనను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా స్థానిక సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకోవాలనేది ఆమె అసలు స్కెచ్ .రాజకీయాల్లో ఒక పాపులర్ స్ట్రాటజీ ఉంది.. పెద్ద ఇమేజ్ ఉన్న నాయకుడిని లేదా సెలబ్రిటీని టార్గెట్ చేయడం ద్వారా చాలా తక్కువ సమయంలోనే వార్తల్లో నిలవవచ్చు. కవిత ప్రస్తుతం సరిగ్గా ఇదే ఫార్ములాను వాడుతున్నట్లు కనిపిస్తోంది. నిజానికి ఆమె ప్రధానంగా ఫైట్ చేయాల్సింది అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో లేదా తన పాత ఓటు బ్యాంక్ కలిగిన బీఆర్ఎస్‌తో. కానీ వారిని వదిలి, ఏపీలో తిరుగులేని పవర్‌తో దూసుకుపోతున్న పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేయడం ద్వారా.. ఏమి సాధిస్తారన్నది ప్రశ్న. కవిత ఎంతగా విమర్శలు గుప్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఉన్న అసలు వాస్తవం ఏమిటంటే తెలంగాణలో జనసేన రాజకీయ ప్రభావం దాదాపు శూన్యం. గత ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని కొన్ని స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, కనీసం డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయింది. అటు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సక్సెస్ తర్వాత హైదరాబాద్‌లోని మణికొండలో జనసేన సరికొత్త ఆఫీసును ప్రారంభించినప్పటికీ, అది ఇంకా ఇక్కడ పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా ఎదగలేదు. అంతగా ప్రభావం లేని పార్టీ అధినేతను ఉద్దేశించి రోజూ ప్రెస్ మీట్లు పెట్టడం వల్ల, కవిత తన స్థాయిని తగ్గించుకోవడమే కాకుండా.. అనవసరంగా జనసేనకు ఇక్కడ మైలేజ్ ఇస్తున్నారనే టాక్ వినిపిస్తోందిపవన్ కల్యాణ్ ఏదో అన్నారని, దాని చుట్టూ దేశద్రోహం కేసుల వరకు వెళ్లడం క్షేత్రస్థాయిలో ప్రజలను పెద్దగా ఆకట్టుకోవడం లేదు. తెలంగాణ సమాజం ప్రస్తుతం నిరుద్యోగం, రైతుల రుణమాఫీ, స్థానిక సమస్యలు, కాంగ్రెస్ పాలన వంటి అంశాలపై చర్చించుకుంటోంది. అంతే తప్ప ఏపీ నేత తెలంగాణ గురించి ఏం మాట్లాడారనే అంశంపై సామాన్యులకు పెద్దగా ఆసక్తి లేదు. ఫలితంగా కవిత చేస్తున్న ఈ విమర్శలు సోషల్ మీడియాలో ట్రోల్స్, కౌంటర్ అటాక్స్‌కు పరిమితం అవుతున్నాయి తప్ప.. ఓటర్ల మధ్య ఒక సీరియస్ చర్చకు దారితీయడం లేదు.ఒక కొత్త ప్రాంతీయ పార్టీగా తెలంగాణ రక్షణ సేన ప్రజల్లోకి వెళ్లాలంటే కేవలం డైవర్షన్ పాలిటిక్స్ లేదా పొరుగు రాష్ట్ర నేతలపై విమర్శలు సరిపోవని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలోని గూడాలలో, పల్లెల్లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై లేదా స్థానిక సమస్యలపై పోరాడితేనే కవితకు మైలేజ్ వస్తుంది. లేదంటే పవన్‌ను టార్గెట్ చేసే ఈ వ్యూహం కేవలం డిబేట్లకే పరిమితమై, రాజకీయంగా ఆమెకు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చకపోవచ్చు.

# అజిత్ రెడ్డికి మెట్రో అడిషన్ ఎండిగా అదనపు బాధ్యతలు

### ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్,జూన్ : సీనియర్ ఐఏఎస్ అధికారి అజిత్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొనసాగుతున్న ఆయనను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా తన బాధ్యతలను కొనసాగిస్తూనే హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా కూడా అజిత్ రెడ్డి విధులు నిర్వర్తించనున్నారు. అజిత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీ అనంతరం తాజాగా ఆయనకు హైదరాబాద్ మెట్రో రైల్‌లో కీలక అదనపు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ కొనసాతున్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్వహణ, విస్తరణ పనులు వేగవంతం చేయడంతో పాటు పరిపాలనా వ్యవహారాల్లో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ నియామకం దోహదపడుతోందని ప్రభుత్వం భావిస్తోంది.

# ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

### వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం తగదు
### మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ



హైదరాబాద్,జూన్ :తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు. 11శాతం పీఆర్సీ జులై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విలీన పక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ్ర÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు.దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల పక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ పక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే పక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన పక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన పక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరని అన్నారు.

# కేతన్ మర్డర్ కేసులో రోజుకో కొత్త విషయం

### చేతన్‌తో సియాగోయల్ ప్రేమయకు క్రికెటే కారణం

ముంబై,జూన్: పుణెకు చెందిన యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, క్రికెట్ కోణం వెలుగులోకి వచ్చింది. కేతన్ హత్య కేసులో నిందితులైన సియా గోయల్, చేతన్ చౌదరీల మధ్య ప్రేమ చిగురించడానికి కారణం క్రికెట్ అని తెలుస్తోంది. సియా గోయల్ సోదరుడు సాహిల్ గోయల్‌ను పోలీసులు 10 గంటలకుపైగా విచారించారు. విచారణ సందర్భంగా గోయల్ పలు ఆసక్తికర విషయాలు బయటపెట్టినట్లు సమాచారం. ఆ వివరాల ప్రకారం..సాహిల్ క్రికెట్ మ్యాచ్‌లు ఆడేవాడు. క్రికెట్ మ్యాచ్‌లు చూడ్డానికి సియా తరచూ వెళుతుండేది. ఈ నేపథ్యంలోనే చేతన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఓ సారి కామన్ ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన దివాళీ పార్టీలోనూ ఇద్దరూ కలిశారు. దీంతో ఇద్దరి మధ్యా స్నేహం బలపడి ప్రేమగా మారింది. సియా, చేతన్ ప్రేమించుకుంటున్న సంగతి సాహిల్‌కు తెలుసు. కేతన్‌తో సంబంధం మాట్లాడుతున్నపుడు సియా అభ్యంతరం వ్యక్తం చేస్తుందని సాహిల్ అనుకున్నాడు. కానీ, సియా అలా చేయలేదు.

# నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ



మార్కాపురం,జూన్ : నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ప్రాజెక్టు వెలిగొండ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు వృథా కావని చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించిన అనంతరం నిర్వాసితులు, లబ్దిదారులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శనివారం దోర్నాల మండలం గంటావానిపల్లిలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు, రైతులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. నీళ్లు లేక చాలా మంది ఫ్లోరైడ్ వాటర్ తాగుతున్నారని.. కృష్ణా నదీ జలాలు ఈ ప్రాంతానికి వస్తాయని ఎవరూ ఆలోచన చేసి ఉండరని తెలిపారు. రాయలసీమ, మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకురావాలని ఎన్టీఆర్ ఆలోచన చేశారని గుర్తుచేశారు. 1996 మార్చి 26న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించామని.. రూ.900 కోట్లు పునరావాసం కోసం కేటాయించామని అన్నారు. రూ.300 కోట్లు మొదటి విడతలో నిర్వాసితులకు ఇస్తున్నామని చెప్పారు. ఏపీలో చాలా ఇబ్బందులు ఉన్నాయని సీఎం అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చు. సుంకేశుల గ్యాప్ పనులను 1998లోనే ప్రారంభించాం. గత ప్రభుత్వాలు కూడా మాలాగే చేసుంటే పరిస్థితి మరోలా ఉండేది. మార్కాపురం జిల్లాలో పండ్ల తోటలు బాగా రావాలన్నారు. భూములు ఇచ్చిన రైతుల త్యాగం గొప్పది. మీరు ఇచ్చిన భూముల వల్ల నాలుగైదు జిల్లాలు బాగుపడతాయి. వెలిగొండ నీళ్లు వచ్చాక చుట్టుపక్కల భూముల విలువ పెరుగుతుంది. మాది ప్రజా ప్రభుత్వం.. అందరికీ లబ్ది చేకూరుస్తాం. కరవు జిల్లా పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని సీఎం తెలిపారు.మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ నేతలు దిట్ట. వైకాపా నేతలు కళ్లు ఆర్పకుండానే అబద్దాలు చెబుతున్నారు. ఆ పార్టీ నేతలు ఇప్పుడు వితండవాదం చేస్తున్నారు. వెలిగొండ పేరుతో వైకాపా ప్రభుత్వం అనేక మోసాలు చేసింది. టన్నెల్-2లో బోరు ఇరుక్కు పోయినా ప్రాజెక్టును ప్రారంభించేశారని మండిపడ్డారు. నక్సలిజంపై పోరాటం చేశానని.. క్లైమోర్ బాంబులు పెడితే వేంకటేశ్వరస్వామి తనను కాపాడారన్నారు. గత పాలకులు రూ.10 లక్షల కోట్లు అప్పులు పెట్టిపోయారని విమర్శించారు. 3,351 వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు రూ.300 కోట్లు జమ చేశామన్నారు. నిర్వాసితుల త్యాగం వృథా కాదని.. అందరికంటే మెరుగైన జీవితం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుపై ఈ టర్మ్‌లో రూ.3,900 కోట్ల వ్యయం అవుతోందన్నారు. 2027 నాటికి మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫేజ్-1, ఫేజ్-2 పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇడుపూరు, గోగులదిన్నె, తోకపల్లి తదితర పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేశామన్నారు. మార్కాపురానికి ప్రత్యేక జిల్లా ఇచ్చామని.. కలెక్టరేట్ కూడా పునరావాస కాలనీ పక్కనే వస్తుందని తెలిపారు. పునరావాస కాలనీ భవిష్యత్తులో ఆదర్శ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు.4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. 23 లక్షల మందికి తాగునీరు అందేలా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. 43.5 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌లకు రూ.120 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చామని.. రూ.98 కోట్లతో సుంకేసుల పనులను ప్రారంభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వెలిగొండ ఆలస్యమైందని విమర్శించారు. పదేళ్ల ముందే ప్రాజెక్టు పూర్తయి ఉంటే రైతుల జీవితాలు మారిపోయేవన్నారు. గొడ్డలి పార్టీ మోసాలు డిజిటల్ మోసాలుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు డ్రామాలు, మోసాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. డిజిటల్ అరెస్ట్ మోసాల తరహాలో వైసీపీ మోసాలు అంటూ దుయ్యబట్టారు. 2024లో కేటాయించిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదన్నారు. టన్నెల్-2లో యంత్రం చిక్కుకుపోయినా తొలగించకుండా ప్రారంభోత్సవం చేశారని విమర్శించారు. నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టం జరగనివ్వమని.. బాధిత రైతులందరికీ న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో నాలుగు జిల్లాల అభివృద్ధి, భూముల విలువ పెరుగుతుందని చెప్పారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తామన్నారు. వెలిగొండ పెండింగ్ బిల్లులన్నీ చెల్లించామని తెలిపారు. మార్కాపురం జిల్లాకు కరువు పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని.. ఈ ప్రాంతంలో హార్టికల్చర్‌కు పెద్దపీట వేస్తామన్నారు. మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. హార్టికల్చర్ అభివృద్ధికి రూ.1 లక్ష కోట్ల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రూ.40 వేల కోట్లు ప్రభుత్వం, రూ.60 వేల కోట్లు ప్రైవేట్ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతుల ఆదాయం పెంచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.రామాయపట్నం పోర్టు, ఎయిర్‌పోర్ట్‌తో ఎగుమతులకు అవకాశముందని సీఎం అన్నారు. రోడ్లు, రైల్వే కనెక్టివిటీతో ప్రాంత అభివృద్ధి వేగవంతం చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తున్నామని.. మైక్రో ఇరిగేషన్‌కు మళ్లీ ప్రోత్సాహం అందిస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు.

**భూములు ఇచ్చిన రైతులు త్యాగం మరువలేనిది**
**తొలివిడతలో నిర్వాసితులకు 300 కోట్ల పరిహారం**
**కృష్ణాజలాలు వస్తాయని ఎవ్వరూ ఊహించలేదు**
**గత ప్రభుత్వ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం**
**వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు**
**నిర్వాసిత రైతులతె సిఎం చంద్రబాబు భేటీ**



# సంజీవిని గేమ్‌ఛేంజర్ పథకం

**ఆగస్ట్ 15 నుంచి అన్ని జిల్లాల్లో అమలు**
**మార్కాపురంను జిల్లా చేసి మాట నిలబెట్టాం**
**రైతులు సేంద్రియ వ్యవసాయం దిశగా సాగాలి**
**సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు**



మార్కాపురం,జూన్ :ప్రజల అండ ఉంటే కొండనైనా ఢీ కొట్టే శక్తి తనకు వస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామన్నారు. కిష్టంశెట్టిపల్లిలో పర్యటించిన ఆయన.. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రజలు ఆనందంగా ఉండేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం సంజీవని లాంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. సంజీవని పథకం ఒక గేమ్ ఛేంజర్ అని అన్నారు. ఆగస్టు 15 నుంచి అన్ని జిల్లాల్లో సంజీవని పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. యోగా, ధ్యానం వంటి మంచి అలవాట్లతో మీ ఆరోగ్యం.. మీ చేతుల్లోనే ఉంటుంది. పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలి.. తాజా ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. వీలైనంత వరకు ఎరువులు తక్కువగా వాడాలి. యూరియా ఎక్కువ వేస్తే పంటను కొనేందుకు సిద్ధంగా లేరు. చాలా మంది ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. భవిష్యత్‌లో పెద్ద కుటుంబాలను ఆదరిస్తాం. ఇంటి కోసం, రేషన్ కార్డు కోసం పిల్లలు, తల్లిదండ్రుల నుంచి విడిపోతున్నారు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది. జనాభా పెరగాల్సిన అవసరం ఉంది. 40 ఏళ్ల తర్వాత ఏం జరుగుతుందో దాని గురించి ఇప్పుడే ఆలోచిస్తాను. నా కంటే ఇన్నోవేషన్ తెచ్చేవారు ఎవరూ ఉండరు. ఇటీవల జెన్ జీ... జెన్ జీ మాట ఎక్కువగా వినిపిస్తోంది. నేనే అందరికంటే పెద్ద జెన్‌జీని. నా కంటే ఇన్నోవేటివ్‌గా ఆలోచించేవారు ఎవరూ ఉండరు. ఇన్నోవేషన్‌తో ముందుకు వస్తే అండగా ఉంటానని అన్నారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. వెలిగొండ ప్రాజెక్టు.. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం. గొడ్డలి పార్టీకి మద్దతు ఇచ్చేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలి. అమరావతిపై వైకాపా కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. అమరావతిని నంబర్ 1 నగరంగా, రాజధానిగా తీర్చిదిద్దుతాం. అమరావతి మా రాజధాని అని కాలర్ ఎగరేసి చెప్పుకొనేలా నిర్మిస్తాంఅని చంద్రబాబు అన్నారు. వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శలు గుప్పించారు. ప్రజల కోసమే కూటమి ఏర్పడిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. 3 వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామన్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని.. ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తున్నామని చెప్పారు. మనసున్న ప్రభుత్వం కాబట్టే ప్రజలకు అన్నీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెరిగాయని.. ప్రైవేటు స్కూళ్ల నుంచి లక్ష మంది ప్రభుత్వ బడుల్లో చేరారని తెలిపారు. అందరికీ సంపూర్ణ ఆరోగ్యం కోసమే సంజీవని పథకాన్ని తీసుకొచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. ఎవరికైనా ఆరోగ్యం ఉంటేనే ఆనందమని.. సంజీవని ద్వారా వేగవంతంగా వైద్య సేవలు అందజేస్తామన్నారు. మన మిత్ర ద్వారా ఇంటి దగ్గరకే సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. 'భవిష్యత్తులో పిల్లలే మన ఆస్తి. ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది' అని అన్నారు. ప్రతిఒక్కరూ క్వాంటమ్, ఎఐ నేర్చుకోవాలని సూచించారు. ఏపీకి పోలవరం జీవనాడి అని ముఖ్యమంత్రి తెలిపారు. వైసీపీ హయాంలో పోలవరాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. పనులు పూర్తికాకుండానే వెలిగొండను జాతికి అంకితం చేశారన్నారు. దిక్కుమాలిన పార్టీ.. గొడ్డలి పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. వైసీపీ పాలనలో మూడు ముక్కలాట ఆడారని మండిపడ్డారు. కుక్కతోక వంకర అన్నట్లు.. వైసీపీ బుద్ధి ఇంకా మారలేదన్నారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారంటూ ÷ర్ అయ్యారు. అమరావతిపై వైసీపీ కుట్రలు ఆగడంలేదన్నారు. మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ దిట్ట అంటూ వ్యాఖ్యానించారు. మన రాజధాని అమరావతి అని కాలర్ ఎగరేసే పరిస్థితి తీసుకొస్తామన్నారు. అమరావతిని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. నదుల అనసంధానం తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశారు. నీటి సమస్యలను అన్ని రాష్ట్రాలు కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. నదుల అనుసంధానమే అన్ని రాష్ట్రాలకు శ్రీరామ రక్ష అని తెలిపారు. వైసీపీ కుల రాజకీయాలు చేస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ సాయికృష్ణ కేసు అంశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లాగి కుట్రలు చేయాలని చూశారని ఆరోపించారు.

# సంక్షేమంతో పాటు...అభివృద్ధి కూడా ముఖ్యమే



**కేవలం సంక్షేమంతో అభివృద్దిని సాధించలేం**
**రోడ్లు, ఆస్పత్రులు, స్కూళ్లను అభివృద్ధి చేయాలి**
**కులాల పేరుతో హాస్టళ్ల ఏర్పాటు సరికాదు**
**కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇదే చేస్తున్నాం**
**కేవలం బటన్ నొక్కితే వైకాపా గతేమయ్యిందో చూశాం**
**అభివృద్దిపై గ్రామస్థాయిలో జనసేన ఆధ్వర్యంలో చర్చ సాగాలి**
**వైకాపా కులరాజకీయాలతో భ్రష్టు పట్టించే యత్నం**
**11 సీట్లు వచ్చినా తిట్ల దండకం ఆపని వైకాపా నేతలు**
**జనసేన నిర్మాణ సారధుల కార్యాచరణ సమావేశంలో పవన్**

అమరావతి,: ఒక్క సంక్షేమ పథకాలే కాదు..అభివృద్ధి కూడా ముఖ్యమన్నది జనసేన విదానమని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల విషయంలో జనసేన పార్టీకి ఎలాంటి వ్యతిరేకత లేదని అన్నారు. నిజంగా నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వ సహాయం, ఉచిత పథకాలు అవసరమేనని ఆయన పేర్కొన్నారు. అయితే సంక్షేమం పేరుతో మాత్రమే ప్రభుత్వాన్ని నడపడం సాధ్యం కాదని, ప్రజలు అభివృద్ధిని కూడా కోరుకుంటారని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల అభివృద్ధి కూడా చాలా ముఖ్యమని అన్నారు. దీనిపై గ్రామస్థాయిలోనే చర్చ సాగాలని పార్టీ నేతలకు పవన్ సూచించారు. కేవలం బటన్ నొక్కి నగదు బదిలీలు చేస్తే ప్రజలు ఎప్పటికీ ఓట్లు వేస్తారనే భావన సరికాదని అన్నారు... అలాంటి రాజకీయాలకు నిలువెత్తు ఉదాహరణ గత ప్రభుత్వం అని, సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కూడా సమానంగా ఉండాలని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పవన్ విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంతసేపు బటన్ నొక్కి డబ్బులు పంపించామని చెప్పడం కంటే, ప్రజలు ప్రయాణించే రోడ్లు ఎవరు వేశారు? దశాబ్దాలుగా నిర్మించని రహదారులు ఇప్పుడు ఎలా నిర్మితమయ్యాయి? అనే విషయాలను కూడా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.. ప్రజలకు సంక్షేమం ఎంత అవసరమో, నాణ్యమైన రహదారులు, ఆసుపత్రులు, ఇతర మౌలిక వసతులు కూడా అంతే అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తమ బాధ్యతగా అభివృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఎన్ని ఉచిత పథకాలు అమలు చేసినా ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందరని పేర్కొన్నారు. వైకాపా నేతలు ఎప్పుడూ విధానాలపై మాట్లాడరని.. తిట్ల దండకం అందుకుంటారని జనసేన అధినేత, అన్నారు. గతంలో కాకినాడకు చెందిన వైకాపా నేత ఎంత దారుణంగా దూషించారో అంతా చూశారన్నారు. 11 సీట్లు వచ్చిన తర్వాత కూడా వైకాపా నేతలు ఏమాత్రం తగ్గకుండా మాట్లాడుతున్నారని అన్నారు. జనసేన నేత పంతం నానాజీ మాట్లాడిన మాటలు తాను విన్నానన్న పవన్.. అలాంటి వాటిని ప్రోత్సహించనని చెప్పారు. కుల రాజకీయాలను ఎప్పటికీ ప్రోత్సహించనని, దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పేరిట వేర్వేరు హాస్టళ్లు ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు.

# 30 ఏళ్ల కల పూర్తయ్యిందన్న రైతులు

**చంద్రబాబుతో భేటీలో రైతలు భావోద్వేగం**

మార్కాపురం,: రైతులతో సీఎం చంద్రబాబు సమావేశం భావోద్వేగభరిత వాతావరణంలో సాగింది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేలా కృషి చేస్తున్నందుకు ముఖ్యమంత్రికి రైతులు ధన్యవాదాలు తెలిపారు.వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి సమావేశానికి రైతులు తరలివచ్చారు.

పొలాల మధ్య రైతులు, నిర్వాసితులతో సీఎం సమావేశమయ్యారు. 30 ఏళ్ల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామంటూ.. రైతులు కన్నీళ్లు పెట్టుకుని భావోద్వేగానికి గురయ్యారు. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు ఆర్ అండ్ ఆర్ కూడా సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నందుకు సంతోషంగా ఉందని వెలిగొండ నిర్వాసితులు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబును రైతులు కోరారు. ఈ సమావేశానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, డీబీవీ స్వామి, గొట్టిపాటి రవి కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు హాజరయ్యారు.

# రాజధానిలో రౌడీయిజం చేసే యత్నం

**అమరావతితో మీకేం పని వెళ్లారు**
**వైకాపా నేతల తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత**

అమరావతి,: వైసీపీ నేతలకు అమరావతిలో పర్యటించే నైతిక అర్హత లేదని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రైతులను పరామర్శించడానికి వెళ్లారా లేక రాజధానిలో రౌడీయిజం చేయటానికి వెళ్లారా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలను రాజధాని రైతులు అడ్డుకోవడంపై హోం మంత్రి అనిత స్పందించారు. 'మీరు వెళ్తే సమస్య వస్తుందని పోలీసులు ముందే చెప్పారు. మీరు వెళ్లిన పెనుమాకలో 90శాతం రైతులు రాజధానికి భూములు ఇచ్చినవారే. రైతులపై రౌడీయిజం చేయడానికి గూండాలని వెంటబెట్టుకుని వెళ్లారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులే తప్పు చేసినట్టు ఇప్పుడు వైసీపీ నేతలు మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ నేతల వెంట వెళ్లినవారిలో ఎంతమంది రౌడీషీటర్‌లు ఉన్నారో డిపా÷-టం÷-మెంట్ దగ్గర మొత్తం సమాచారం ఉందన్నారు. వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తామన్నారు. అమరావతి ప్రజల కలల రాజధాని ఈరోజు శరవేగంగా ముందుకు వెళుతోందని అన్నారు. 2027 నాటికి అమరావతి పూర్తి కావాలని అందరం అహర్నిశలూ కష్టపడుతున్నామని హోం మంత్రి వెల్లడించారు. ఆనాడు అమరావతి రాజధాని అని ఒప్పుకొని తర్వాత మూడు రాజధానుల డ్రామాలాడారని విమర్శించారు. మరలా ఇప్పుడు మావిగాన్ అంటూ ఏ ముఖం పెట్టుకొని రాజధానిలో పర్యటిస్తారని ప్రశ్నించారు. అమరావతి పూర్తయితే తమకి మనుగడ కూడా ఉండదని వైసీపీ ఈ డ్రామాలు చేస్తోందని మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అమరావతి రైతులపై రౌడీ మూకలతో చేసిన దాడే అని అన్నారు. జరిగిన ఘటనపై అధికారులను అడిగి సమాచారం తెలుసుకున్నట్లు తెలిపారు. అమరావతి రైతులు కడుపు మంటతో ఉన్నారన్నారు. అమరావతి రైతులకు అండగా ఉన్నందుకు గతంలో చంద్రబాబుపై భావ ప్రకటన స్వేచ్ఛ అంటూ దాడులు చేశారని.. కానీ మేము అలాంటి వాటిని ప్రోత్సహించడం లేదని అనిత అన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటుందని.. విచారణ కూడా చేస్తామన్నారు. వైసీపీ నేతలను అడ్డుకుంది అమరావతి రైతులేనని.. టీడీపీ కార్యకర్తలు కాదని



స్పష్ట [redacted] డాలు
నేడు [redacted] కూడా
ఉన్నా [redacted]

# వానా కాల్ వచ్చేస్తోంది... వంటా వార్పు ఎలా

నల్గొండ, జూన్ 27, (న్యూస్ పల్స్)ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ కిచెన్ షెడ్లు నిర్మించలేదు. దీంతో మండల వ్యాప్తంగా అనేక పాఠశాలల్లో చెట్ల కింద వంట చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 57 ప్రభుత్వ విద్యాలయాలు ఉండగా అం దులో 4,000 వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన మౌలిక వసతులు అనేక పాఠశాలలో ఇప్పటివరకు కల్పించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, వంట వండి పెట్టే ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక పాఠశాలల్లో నీటి వసతి లేదని, చాలా చోట్ల కిచెన్ షెడ్లు లేవని , దీనితో పాఠశాలల ఆవరణలో వరండాలు, చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.స్మార్ట్ క్లాస్‌రూమ్స్ గురించి మాట్లాడుతున్న ఈ రోజుల్లో, ఇంకా వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల మధ్యాహ్న భోజనం చెట్ల కిందే వండుతున్నారు. వర్షం వస్తే వంట ఆగిపోతుంది.. పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.చాలాచోట్ల నీటి వసతి లేని చోట వ్యవసాయ బావుల నుండి, సమీపంలోని ఇండ్ల నుండి నీళ్లు తెచ్చుకుంటున్నారు. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు వంటకి పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ వర్షాకాలంలో తాము వంట చేయడానికి తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన వంట చెరుకు నిల్వ చేయడం, సామాగ్రి నిలువ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసే జులై, ఆగస్టు నెలలో వంట చేయడం తమకు పెద్ద తంటగా మారిందని వాపోతున్నారు.ఇక అధిక సంఖ్యలో విద్యార్థులు చదువుతున్న హైస్కూళ్ళు, కొన్ని ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు లేకపోవడంతో విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వందల మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేయడానికి అనువైన వసతి లేక తరగతి గదుల్లో, పాఠశాల ఆవరణ చెట్ల కింద భోజనం చేస్తున్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో డైనింగ్ హాళ్లను నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించగా చాలా చోట్ల పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.ఇక ఇదే తరహాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కిచెన్ షెడ్ నిర్మాణం ప్రారంభించినప్పటికీ చాలా చోట్ల నిర్మించలేదు. దీనితో ఈ విద్యా సంవత్సరంలో కూడా పాత పద్ధతిలో చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రతి పాఠశాలలో కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్ నిర్మించి, నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.కేసముద్రం మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు లేక మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో వంట సిబ్బంది చెట్ల కింద వంట చేయాల్సి వస్తుండగా, విద్యార్థులు తరగతి గదుల్లో లేదా ఆవరణలో భోజనం చేస్తున్నారు. నీటి వసతి లేకపోవడం సమస్యను మరింత పెంచుతోంది.

# 15 ఏళ్ల సమస్యకు మంత్రి పరిష్కారం

కరీంనగర్, జూన్ 27, (న్యూస్ పల్స్)బస్సు సౌకర్యం లేని గ్రామాలకు కొత్త సర్వీసు ప్రారంభించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ చూపించారు. దీంతో ఆ మార్గంలోని గ్రామాలు.. గత 15 ఏళ్లుగా బస్సు కోసం చూస్తున్న ఎదురుచూపులు ఫలించాయి. దీంతో వారు మంత్రి అడ్లూరికి ధన్యవాదాలు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా తమ మార్గంలో బస్సు నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరినా.. ఎవరూ పట్టించుకోలేదని మంత్రి అడ్లూరి తమ గోడు విని స్పందించారని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుత యుగంలో ప్రజల జీవనశైలి శరవేగంగా మారిపోతున్నా.. కొన్ని మారుమూల ప్రాంతాలు మాత్రం వెనకబడిపోతూనే ఉన్నాయి. ఇప్పటికీ దేశంలోని కొన్ని ప్రాంతాలకు కరెంటు, రోడ్లు, తాగునీరు, బస్సు సౌకర్యం లేకపోవడం తీవ్ర ప్రశ్నలకు దారితీస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అలాంటి గ్రామాలకు మౌలిక వసతుల కల్పన జరిగితే.. ఆ జనాల్లో వచ్చే ఆనందాలే వేరు. ఇలా కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న వారి దీనస్థితిని చూసి రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సెలబ్రిటీలు రంగంలోకి దిగి.. వారి సమస్యలను పరిష్కరిస్తున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. తాజాగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. బస్సు సర్వీసు ఏర్పాటు చేసి వారి మొహాల్లో చిరునవ్వులు చిందేలా చేశారు.జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి వెల్గటూర్ మండల కేంద్రానికి 15 ఏళ్ల తర్వాత ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో వారికి బస్సు సౌకర్యం వచ్చింది. ఈ బస్సు సర్వీసు జగిత్యాల నుంచి ప్రారంభమై.. వయా గొల్లపల్లి, చిల్వకోడూర్, అబ్బాపూర్ మీదుగా వెల్గటూర్ వరకు గతంలో నడిచేది. కానీ ఆ బస్సు సర్వీసును రద్దు చేయడంతో ఆ మార్గంలో ఉండే గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలోనే తమకు తిరిగి బస్సు సౌకర్యం కల్పించాలని.. గత 15 ఏళ్లుగా ఎంతోమందికి విజ్ఞప్తులు, వినతులు పెట్టుకున్నారు.ఈ క్రమంలోనే ఆయా గ్రామాల ప్రజలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కోరగా ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని వారికి తిరిగి బస్సు సౌకర్యం కల్పించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రోజున అబ్బాపూర్ గ్రామంలో కొత్త బస్సు సర్వీసును మంత్రి అడ్లూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అడ్లూరి.. బస్సు సౌకర్యం కోసం గ్రామస్థులు చాలాసార్లు తనకు విజ్ఞప్తి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయా గ్రామాల ప్రజల కోరిక మేరకు బస్సు సౌకర్యాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. స్థానిక గ్రామాల ప్రజలు ఈ బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.అదే సమయంలో అబ్బాపూర్ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా మంత్రి అడ్లూరి ప్రారంభించారు. అదే సమయంలో ఆ గ్రామంలో మూతబడిన పాఠశాల తిరిగి పునరుద్ధరించగా.. దాన్ని కూడా మంత్రి ప్రారంభించారు. ఇక ఆ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించేందుకు తాను ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా గ్రామస్థులు కృషి చేయాలని హితవు పలికారు.

# జ్యువెలరీ షోరూమ్ లో రౌడీల వీరంగం

హైదరాబాద్,బంజారాహిల్స్ జ్యువెలరీ షోరూమ్లో రౌడీ షీటర్ వీరంగనీ సృష్టించాడు. బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేసాడు. పోలీసులు అలీమ్, యూనస్ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసారు. రోడ్ నం.10లోని శ్రీ సాయి జగదాంబ పెరల్స్ అండ్ జ్యువెలర్స్ షోరూమ్లో ఘటన జరిగింది. మద్యం మత్తులో వచ్చి మేనేజర్ను బెదిరించారని ఫిర్యాదు. మేనేజర్ ను కత్తితో బెదిరించి లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. నెక్స్ట్ టైమ్ వచ్చినప్పుడు డబ్బు రెడీ గా ఉంచాలని బెదిరింపులకు గురిచేసారు. తనకు, సిబ్బందికి ప్రాణహాని ఉందని, తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారని మేనేజర్ పంకజ్ బండ్గర్ ఫిర్యాదు చేసాడు.

# మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం అక్రమాలపై 11 మందిపై కేసు

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి ,:మంథని మండలం మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అక్రమాల వ్యవహారా న్ని జిల్లా యంత్రాంగం అత్యంత తీవ్రంగా పరిగణి స్తోందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లైస్ శాఖ తనిఖీ నివేదికలు, పంచనామా, సంబంధిత అధికారుల నివేదికల ఆధారంగా



ప్రాథమి క వ్యవసాయ సహకార సంఘం అధికారులు మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, 11 మందిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణ లో ట్యాబ్ ఆపరేటర్ నకిలీ ట్రక్ చిట్లు సృష్టించడం, కొను గోలు రికార్డుల్లో అక్రమ నమోదులు చేయడం, స్టాఫ్ అసిస్టెంట్ అక్రమ ధాన్యం రవాణాకు సహకరించడం, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ప్రమేయంతో కుట్రపూరితంగా వ్యవహరించినట్లు గుర్తించిన ట్లు తెలిపారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న 11 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు, దర్యాప్తులో మరెవరి ప్రమేయం వెలుగులోకి వచ్చినా వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తనిఖీల్లో మూడు లారీల్లో తరలిస్తున్న 2,213 బస్తాలు, సుమారు 885.20 క్వింటాళ్ల ధాన్యాన్ని స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎనిమిది నకిలీ ట్రక్ చిట్ల ద్వారా 5,421 బస్తాలు 2,168.40 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు రికార్డుల్లో అక్రమంగా నమోదు చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు పేర్కొన్నారు. రైతుల శ్రమను దోపిడీ చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ బోమని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పూర్తి పారదర్శకత ను పాటించేలా అన్ని కొనుగో లు కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యల తో పాటు శాఖాపరమై న చర్యలు కూడా తప్పవని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.

# డబుల్ ఓటు వద్దు.. సింగిల్ ఓటే ముద్దు.

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.**
**రెండు చోట్ల ఓటు ఉండటం నేరం..**
**సర్ ప్రక్రియకు ప్రతి ఓటరు సహకరించాలి.**
**రాజకీయ స్వార్థం కోసం ఇతర ప్రాంతాల ఓటర్ల నమోదు ప్రజాస్వామ్యానికి విఘాతం.**

డబుల్ ఓటు వద్దు.. సింగిల్ ఓటే ముద్దు అని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఆయన స్వగృహానికి శనివారం నందిగామ మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన బీఎల్ఓ బుచ్చమ్మ, నోముల వెంకటదాస్, సూపర్వైజర్ ఎన్. పద్మ, బీఎల్ఏ శ్రీశైలం తదితరులు వెళ్లి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు కుటుంబ సభ్యులకు ఎన్యూమరేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా అధికారులు వారిని కలిసి మాట్లాడారు.ఆ తర్వాత షాద్ నగర్ నియోజకవర్గంలో బతితీ సర్వే ఎలా జరుగుతుందో స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఒకే ఓటు మాత్రమే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు చోట్ల ఓట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వ నిబంధనల ప్రకారమేనని పేర్కొన్నారు. ప్రతి ఓటరు తన ఓటుకు తానే బాధ్యుడని, అనవసరంగా ఒక ఊరిలో ఒక ఓటు, తాను నివసించే మరో ప్రాంతంలో ఇంకో ఓటు నమోదు చేసుకోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉపాధి, జీవనోపాధి కోసం బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి అనేక మంది వలస వచ్చి పరిశ్రమలు, ఇతర రంగాల్లో పనిచేస్తూ జీవిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అలాంటి వారు తమ స్వస్థలంలో ఒక ఓటు, ఇక్కడ మరో ఓటు కలిగి ఉండటం పూర్తిగా నేరమని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో సర్ కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి ఓటరు తన ఓటును సరైన ప్రాంతంలో నమోదు చేసుకునేలా అధికారులకు సహకరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎవరైనా తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# రాయిదుర్గం లో ల్యాప్ టాప్ చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగ అరెస్ట్

ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం ఓ యువకుడిని వరుస దొంగతనాల బాట పట్టించింది. అప్పులు తీర్చుకునేందుకు ల్యాప్‌టాప్‌లను చోరీ చేస్తున్న నిందితుడిని రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించి విలువైన ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ల్యాప్‌టాప్ చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. చిత్తూరు జిల్లా రొంపిచర్లకు చెందిన 23 ఏళ్ల నాగిశెట్టి జశ్వంత్‌ను అరెస్టు చేశారు. మాజీ అమెజాన్ ఉద్యోగిగా పనిచేసిన జశ్వంత్‌కు ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం ఉండటంతో సుమారు రెండు లక్షల రూపాయల అప్పులు అయినట్లు విచారణలో వెల్లడైంది.ఆ అప్పులు తీర్చేందుకు గత ఆరు నెలలుగా రాయదుర్గం పరిసర ప్రాంతాల్లో ల్యాప్‌టాప్ చోరీలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. జూన్ 22న ఖాజాగూడలోని ఎంఆర్ గ్రాండ్ హాస్టల్‌లో మూడు ల్యాప్‌టాప్‌లు చోరీకి గురికాగా, నమోదైన కేసు దర్యాప్తులో పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి జూన్ 26న అదుపులోకి తీసుకున్నారు. గత ఐదు నెలల్లో మొత్తం ఎనిమిది ల్యాప్‌టాప్‌లను దొంగిలించినట్లు విచారణలో తేలింది. వాటిలో నాలుగు ల్యాప్‌టాప్‌లను క్యాషిఫై యాప్ ద్వారా విక్రయించగా, మరో నాలుగు ల్యాప్‌టాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.50 లక్షలు. నిందితుడిపై రాయదుర్గంలో నాలుగు, మాదాపూర్‌లో ఒకటి కలిపి మొత్తం ఐదు చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

# పాలమూరుకు బ్రహ్మోస్ యూనిట్

మహబూబ్ నగర్, జూన్ 27(న్యూస్ పల్స్)పాలమూరు జిల్లాకు ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ రానుందనే ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో భేటీలో ఈ అంశం చర్చకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం మిస్సైల్ యూనిట్ ఏర్పాటుకు సానుకూలంగా ఉండడంతో మరోసారి ఆసక్తికరంగా మారింది. ప్రతిపాదిత ప్రాంతంపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గతేడాది జూన్ 18న సీఎం రేవంత్ రెడ్డితో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు.తెలంగాణ ప్రాంతంలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ను విస్తరించాలని సంస్థ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్ ? బెంగళూరు మధ్యలో మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర మండలంలో అవసరమైన ప్రభుత్వ స్థలం ఉందని వివరించారు. సీఎం వినతికి స్పందించిన ప్రతినిధులు ఆ తర్వాత మూడురోజుల్లోనే స్థల పరిశీలన చేసి నివేదిక రూపొందించారు.వాస్తవంగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని బస్వాయ్ పల్లి, చౌదర్ పల్లి గ్రామాల మధ్య సుమారు 400 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్, అనుబంధ సంస్థలకు అనుకూలంగా ఉంటుంది. ఔఊ 44, ఔఊ 167 కు మధ్యలో ఉన్న ప్రాంతం కావడంతో రవాణా సౌకర్యాలతో ఇబ్బందులు లేవు. అలాగే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 100కిలో మీటర్ల దూరంలోనే ఉంది. గతేడాది స్థల పరిశీలన చేసిన అధికారులు పలు సూచనలు చేసినట్లు సమాచారం. మిగతా ప్రాంతాల్లోనూ స్థల అన్వేషణ చేసినా ఆఖీఆఒ బృందం పాలమూరు జిల్లా వైపే మొగ్గు చూపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఇక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు మరోసారి చర్చకు రావడంతో చౌదర్ పల్లి, బస్వాయిపల్లి గ్రామస్థుల్లో ఆశలు పెరిగాయి. దేశ రక్షణలో కీలకంగా మారిన మిస్సైల్ తయారీ తమ ప్రాంతంలో తయారు కావడాన్ని గర్వంగా ఫీల్ అవుతామంటున్నారు. అన్ని సౌకర్యాలు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో కచ్చితంగా ఈ బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు, ప్రాంత అభివృద్ధికి అవకాశం లభిస్తుందని చెబుతున్నారు.త్వరలోనే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ ఏర్పాటు విషయంలో కేంద్రం అనుమతి వస్తుందని అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు. అనుమతి వస్తే దేశ రక్షణ వ్యవస్థలో పాలమూరు ఖ్యాతి ఇమిడిపోనుంది.

# రైతుల పక్షపాతికి భూ నిర్వాసితుల గోస కనిపిస్తలేదా

**- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష**



పెద్దపల్లి , రైతుల పక్షపాతిగా చెప్పుకునే ఎమ్మెల్యే విజయ రమణ రావుకు భూ నిర్వాసితుల గోస కనిపిస్తలేదా అంటూ బీ ఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె మండలంని పెద్దకల్వల గ్రామం వద్ద ప్రతిపాదిత బైపాస్ రోడ్డు నిర్మాణం పనులను రైతులు అడ్డుకోవడం ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. అధికారులు రైతులను సంప్రదించకుండా,ఏకపక్షంగా వ్యవసాయ భూముల్లో మార్కింగ్‌లు వేయడాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష తీవ్రంగా ఖండించారు. ఆందోళన చేస్తున్న భూ నిర్వాసిత రైతులకు ఆమె సంఘీభావం ప్రకటించారు. గతంలో గ్రామ ప్రజాప్రతినిధికి చెందిన స్థలానికి సమీపంగా బైపాస్ రోడ్డు ఉండాలని నిర్ణయించిన ప్పటికీ,తాజాగా ప్రణాళికను మార్చి, చిన్న, సన్నకారు రైతుల సారవంత మైన వ్యవసాయ భూముల మీదుగా రోడ్డును మళ్లించడం వెనుక పెద్ద కుట్ర ఉందని దాసరి ఉష ఆరోపించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, హడావుడిగా ఎర్రజెండాలు పాతడం వెనుక అధికార పార్టీ నేతల స్వార్థం దాగి ఉందని ఆమె మండిప డ్డారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ రైతుల పొట్ట కొట్టి,వారి భూములను లాక్కోవాలని చూడటం దుర్మార్గమని,ఒక రైతుకు మూడు ఎకరాల వరకు భూమి పోయే పరిస్థితి ఉంటే, ఆ కుటుంబాలు రోడ్డున పడతాయని, దాదాపు 15 ఎకరాల సారవంతమైన భూమి ఈ సర్వే వల్ల నాశనమవుతోంది. కొందరు బడా వ్యక్తుల అక్రమ కట్టడాలను కాపాడటం కోసమే పేద రైతుల భూములను బలి ఇస్తారా అంటూ ప్రశ్నించారు. భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించకుండా,రైతుల అనుమతి లేకుండా చేసే సర్వేలను వెంటనే నిలిపివేయాలన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి, భూ నిర్వాసిత రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు. రైతుల సమస్యను పట్టించు కోకుండా,బలవంతంగా భూసేకరణకు ప్రయత్నిస్తే రైతుల సమస్య పరిష్కారమ య్యే వరకు వారి పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తామని, అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆమె స్పష్టం చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి:

**సర్పంచ్ మామిడాల లలిత రాజేశం**
**రాజీవ్‌నగర్ గ్రామంలో ఇంటింటి సర్ ఓటరు సర్వేప్రజాక్రాంతి;**



తాండూర్,ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ సర్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాజీవ్‌నగర్ గ్రామంలో ఇంటింటి ఓటరు సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మామిడాల లలిత రాజేశం మాట్లాడుతూ,ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారు తమ వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమానికి సహకరించి, సరైన ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలి అని అన్నారు.అనంతరం బిఎల్ఓ ఎన్. రజిత, బిఎల్ఏ సీహెచ్. నరేష్, ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# కుర్మవాడలో రూ.21.50 లక్షల సీసీ రోడ్డు, పైప్ డ్రైన్ పనులకు శంకుస్థాపన

కరీంనగర్ ,కరీంనగర్ నగరపాలక సంస్థ 48వ డివిజన్ కుర్మవాడలో రూ.21.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, పైప్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. మున్సిపల్ సాధారణ నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నగరంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కర్రె పద్మ-అనిల్, 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి-ప్రకాష్, 47వ డివిజన్ కార్పొరేటర్ గాజ రామ-శివరాం, 22వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రోజూ నాలుగు తులసి ఆకులు తింటే- బీపీ, కొలెస్ట్రాల్, జీర్ణ సమస్యలకు చెక్...!!



తులసి. ఈ మొక్క ఆధ్యాత్మికతలో ఎంతో పవిత్రమైనది. తులసిలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. యాంటీఆక్సిడెంట్లు, యాంటీవైరల్, యాంటీబాక్టీరియల్ గుణాలు కలిగి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి . రోజూ ఉదయం పరగడుపున 5 నుండి 7 తులసి ఆకులు నమలడం వల్ల శరీరానికి అద్భుతమైన ప్రయోజనాలు చేకూరుతాయి. రక్తపోటు.. కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచటంలో సహకరిస్తుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. తులసి ఆకు లో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి రక్తపోటు స్థాయిలను మరియు కొలెస్ట్రాల్‌ను కూడా నియంత్రణలో ఉంచుతాయి. క్యాన్సర్, ఊబకాయం, గుండె సమస్యల పరిష్కారంతో తులసి ప్రభావం చూపుతుంది. తులసి ఆకులు క్యాన్సర్ కారక కణాలు.. హెచ్ఐవి కణాల పెరుగుదలను అరికట్టడంలో కూడా సహాయపడతాయి. రక్తాన్ని శుద్ధి చేసి, తద్వారా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. తులసి టీ తాగడం వల్ల శరీరం నుండి విషపదార్థాలను బయటకు పంపించి, జీర్ణవ్యవస్థను శుభ్రపరచడం ద్వారా మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఎవరైనా తులసి నీటిని క్రమం తప్పకుండా తాగితే, వారు అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందుతారు. రక్తపోటు- ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడు తుంది. రక్తపోటుతో బాధపడేవారు ప్రతిరోజూ కొన్ని తులసి ఆకులను తినడానికి లేదా మార్కెట్లో సులభంగా లభించే తులసి టీని తాగడానికి ఇష్టపడవచ్చు. రోజూ తీసుకోవటంతో ఆరోగ్య ప్రయోజనాలు ఒత్తిడి వల్ల కలిగే అల్సర్ల ప్రభావాలను ఎదుర్కోవడంలో తులసి ఆకులు అద్భుతంగా పని చేస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచటంలో తులసి మేలు చేస్తుంది. ప్రతిరోజూ ఉదయం కొన్ని తులసి ఆకులను నమలడం లేదా గోరువెచ్చని నీటితో తులసి ఆకులను క్రమం తప్పకుండా తాగడం మంచిది. మూత్రపిండాల్లో రాళ్లు మరియు గౌట్ సమస్యను నివారించడంలో ప్రభావ వంతంగా పని చేస్తుందని చెబుతున్నారు. తులసి ఆకులలోని మూత్రవిసర్జన గుణాలు, ఆర్థరైటిస్ మరియు గౌట్ సమస్యలను నయం చేయడానికి వాటిని సమర్థవంతమైన సహజ ఔషధంగా చేస్తాయి. ఇలా తులసి ద్వారా ఎన్నో రకాలుగా ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

# ఖాళీ కడుపుతో యాపిల్ ను ఉడికించిన నీటిని తాగండి చాలు..!!

ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల చాలామంది రకరకాల జీర్ణక్రియ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి ఇబ్బందుల నుంచి ఉపశమనం కోసం మాత్రలపై ఆధారపడకుండా, సులభంగా ఇంట్లోనే సిద్ధం చేసుకునే సహజ సిద్ధమైన చిట్కాలు ఎంతో మేలు చేస్తాయి. అలాంటి వాటిలో యాపిల్ ను ఉడికించిన వాటర్ ఒకటి. ఇది మన జీర్ణవ్యవస్థను సహజ రీతిలో కాపాడుతూ కడుపును ఆరోగ్యంగా ఉంచడంలో అద్భుతంగా సహాయపడుతుంది. సాధారణంగా పచ్చి యాపిల్స్ తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని డాక్టర్లు చెబుతుంటారు. అయినప్పటికీ, సున్నితమైన జీర్ణశక్తి ఉన్నవారికి లేదా తరచుగా కడుపు సమస్యలతో బాధపడేవారికి పచ్చి యాపిల్‌లోని కఠినమైన పీచును అరిగించుకోవడం కాస్త కష్టమైన పనే. అలాంటి సమయంలో ఉడికించిన యాపిల్ ముక్కలు, నీటిని తీసుకోవడం వల్ల అందులోని సహజ పీచు పదార్థం మెత్తబడి, సులభంగా జీర్ణమవుతుంది. ఇది కడుపులో మంటను క్రమంగా తగ్గించి జీర్ణకోశాన్ని ప్రశాంతపరుస్తుంది. ఉడికించిన యాపిల్ అందించే ప్రయోజనాలుయాపిల్‌ను నీటిలో ఉడికించినప్పుడు అందులో ఉండే 'పెక్టిన్' అనే కరిగే పీచు పదార్థం (సొల్యూబుల్ ఫైబర్) లోపల మరింత క్రియాశీలంగా మారుతుంది. ఇది ఓ చక్కటి ప్రీబయోటిక్‌లా పనిచేస్తూ పేగుల్లో నివసించే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. తీవ్రమైన మలబద్ధకం సమస్యతో రాత్రి సమయంలో ఇబ్బంది పడేవారికి ఇది మలవిసర్జన ప్రక్రియను సాఫీగా మార్చుతుంది. అతిసారం లేదా విరేచనాల ఇబ్బంది ఉన్నప్పుడు పేగుల్లోని అదనపు నీటిని గ్రహించి ఉపశమనాన్ని కలిగిస్తుంది. నిరంతరం వేధించే ఎసిడిటీ, గుండెల్లో మంటతో సతమతమయ్యే వారికి ఉడికించిన యాపిల్, దాని నీరు ఓ ఔషధంగా ఉపయోగపడుతుంది. ఇది కడుపు లోపలి పొరలపై ఒక పూతలా ఏర్పడి యాసిడ్ ప్రభావాన్ని వేగంగా తగ్గిస్తుంది. ఆయుర్వేద వైద్య విధానం ప్రకారం కూడా, ఉడికించిన యాపిల్ శరీరంలో తేలికగా అరిగి, జీర్ణక్రియ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఇది శరీరంలో ఏర్పడే వాత, పిత్త దోషాలను సమతుల్యం చేసి, జీర్ణవ్యవస్థలోని లోపాలను





రక్షిస్తుంది. ఉడికించిన యాపిల్‌ను ఎలా తయారు చేయాలి? దీన్ని తయారు చేయడం కూడా చాలా సులభం. దీనికోసం ఓ యాపిల్ తీసుకుని, దానిపై ఉన్న తొక్కను తొలగించి చిన్న ముక్కలుగా కోసుకోవాలి. ఆ తర్వాత తగినన్ని నీళ్లలో ఈ ముక్కలను వేసి అవి మెత్తబడే వరకు బాగా ఉడికించాలి. ఆపై ఉడికిన ముక్కలను తేలికగా నలిపి, గోరువెచ్చగా ఉన్నప్పుడే నేరుగా తినాలి. దీని రుచిని, జీర్ణశక్తిని మరింత పెంచుకోవడానికి చిటికెడు దాల్చినచెక్క పొడిని కూడా చేర్చుకోవచ్చు. ఉడికించిన నీటిని పారవేయకుండా దాన్ని తాగాలి. ఉడికించిన యాపిల్‌ను ఉదయం పూట ఖాళీ కడుపుతో లేదా సాయంత్రం వేళల్లో తేలికపాటి స్నాక్‌గా తీసుకోవడం వల్ల గరిష్ట ఫలితాలు పొందవచ్చు. చిన్న పిల్లలు, వయోవృద్ధులు, కడుపు సమస్యల నుంచి కోలుకుంటున్న రోగులకు ఇది సులభంగా అరిగి, శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువగా ఉన్న మధుమేహ రోగులు మాత్రం దీనిని వైద్యుల సలహాతో తగిన పరిమాణంలో మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. సహజసిద్ధమైన పద్ధతుల ద్వారా జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుచుకోవాలని భావించే వారికి ఉడికించిన యాపిల్ ఒక చక్కని ప్రత్యామ్నాయ మార్గం. నిత్యం దీనిని ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల పొట్ట ఉబ్బరం తగ్గి జీర్ణ సామర్థ్యం రోజురోజుకూ పెరుగుతుంది. రోజువారీగా సమతుల్య ఆహారంతో పాటు ఇలాంటి చిన్న ఆరోగ్య చిట్కాలను పాటించడం వల్ల భవిష్యత్తులో వచ్చే దీర్ఘకాలిక పేగు వ్యాధుల పెను ముప్పుల నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు.

# స్ట్రీట్ స్టైల్ 'వెజ్ మోమోస్' ఇంట్లోనే ఈజీగా చేసుకోండిలా..!



ఇటీవలి కాలంలో ఫుడ్ ప్రియులు ఎక్కువగా ఇష్టపడే రెసిపీలలో మోమోస్ ఒకటి. చాలామంది వెరైటీ రకం మోమోస్ ను తినడానికి ఇష్టపడుతుంటారు. అయితే బయట లభించేవి అంత హెల్దీనా..? కాదా..? తెలియదు. కాబట్టి ఇంట్లోనే ఇలా ఈజీగా వెజ్ మోమోస్ ప్రిపేర్ చేసుకోండి. ఇలా చేస్తే చాలా రుచిగా ఉంటాయి. అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. మరి ఈ సూపర్ టేస్టీ వెజ్ మోమోస్ ను ఎలా తయారు చేయాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ చూడండి.. వెజ్ మోమోస్ తయారీకి కావాల్సన పదార్థాలు చూస్తే.. మైదా పిండి రెండు కప్పులు, క్యాబేజీ తరుగు రెండు కప్పులు, క్యారెట్ తరుగు అర కప్పు, క్యాప్సికమ్ తరుగు అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు ఒకటి చిన్నది, అల్లం, వెల్లుల్లి తరుగు ఒక టేబుల్ స్పూన్, మిరియాల పొడి ఒక టేబుల్ స్పూన్, సోయా సాస్ ఒక టేబుల్ స్పూన్, నూనె రెండు టేబుల్ స్పూన్ లు, ఉప్పు రుచికి సరిపడా, నీళ్లు సరిపడా తీసకోవాలి. ఇప్పుడు వెజ్ మోమోస్ తయారీ విధానం చూస్తే.. మరిన్ని కనుగొనండి అనీనిటతిఎవనిబిబ ఉ పిండి స్టఫింగ్ ఈనీనీట వెల్లుల్లి ముందుగా మైదా, ఉప్పు, నూనె, నీళ్లు కలిపి 20 నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు నూనెలో కూరగాయలు, సాస్, ఉప్పు వేసి పెద్ద మంటపై వేయించాలి. ఆ తర్వాత చల్లార్చాలి. ఇప్పుడు పూరీలా ఒత్తి, స్టఫింగ్ పెట్టి, మీకు నచ్చిన ఆకారంలో మోమోస్ ను చుట్టాలి. ఆ తర్వాత స్టీమర్ పై 10 నుంచి 12 నిమిషాలు ఆవిరిపై ఉడికించాలి. అంతే ఇప్పుడు సర్వ్ చేసుకోవడమే.. సూపర్ టేస్టీ వెజ్ మోమోస్ రెడీ అయినట్టే.

# వాస్తు ప్రకారం ఇంట్లో ఈ మొక్క పెంచండి చాలు

ఇంటిని అందంగా అలంకరించుకోవడానికి చాలామంది రకరకాల మొక్కలను పెంచుతుంటారు. వాటిలో 'లక్కీ బాంబూ' (వెదురు మొక్క) అత్యంత ప్రాచుర్యం పొందింది. ఇంటి అలంకరణ కోసమే కాకుండా, వాస్తు శాస్త్రం ప్రకారం కూడా ఈ లక్కీ బాంబూకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇంట్లో ఈ మొక్కను ఉంచడం వల్ల సకారాత్మక శక్తి పెరిగి, ప్రతికూలతలు తొలగిపోతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ఇది కుటుంబ సభ్యుల మధ్య బంధాలను బలోపేతం చేయడంతో పాటు ప్రశాంతమైన వాతావరణాన్ని అందిస్తుంది. లక్కీ బాంబూ మొక్క ఇంట్లోని దోషాలను నివారించి ఐశ్వర్యం, ఆరోగ్యం, విజయం, కీర్తిని ఆకర్షిస్తుంది. ఈ మొక్కను సరైన దిశలో ఉంచినప్పుడు మాత్రమే ఆశించిన ఫలితాలు లభిస్తాయి. వాస్తు నియమాలను పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ ఉంచితే దీని వల్ల ప్రయోజనం ఉండకపోవచ్చు.





అందుకే ఇంట్లో లేదా ఆఫీసులో లక్కీ బాంబూను ఉంచేటప్పుడు కొన్ని కీలక విషయాలను గుర్తుంచుకోవాలి. మరిన్ని కనుగొనండి రాజూనీతీబిబ లక్కీ బాంబూను ఏ దిశలో ఉంచాలి? వాస్తు శాస్త్రం ప్రకా రం లక్కీ బాంబూ మొక్కను ఉంచడాని కి తూర్పు దిశ అత్యంత అనుకూ లమైనది. తూర్పు దిక్కు ఆరోగ్యం, ఎదుగుదలకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ దిశలో వెదురు మొక్కను ఉంచడం వల్ల కుటుంబంలో శాంతి నెలకుంటుంది, పురోగతి సాధ్యమవుతుంది. ఒకవేళ ఆఫీసులో లేదా పని చేసే డెస్క్ మీద ఉంచుకోవాలనుకుంటే, ఇది కెరీర్ ఎదుగుదలకు, కొత్త అవకాశాలకు దోహదపడుతుంది. సాధారణంగా రెండు నుంచి మూడు అడుగుల ఎత్తున్న మొక్కలను ఎంచుకోవడం మంచిది. అలాగే పడకగదిలో రెండు కాడలు ఉన్న లక్కీ బాంబూ మొక్కను పెడితే దంపతుల మధ్య అనురాగం పెరుగుతుందని విశ్వసిస్తారు. ప్రతి పని కూడా సజావుగా సాగుతుందని విశ్వసిస్తారు. వెదురుకు వేగంగా పెరిగే గుణం ఉందనే విషయం తెలిసిందే. అలాగే తమ కుటుంబం కూడా పురోగతి చెందుతుందని నమ్ముతారు. కాడల సంఖ్యకు ఉండే ప్రాధాన్యం లక్కీ బాంబూ కుండీలో ఉండే కాడల సంఖ్యను బట్టి వేర్వేరు ఫలితాలు ఉంటాయని వాస్తు నిపుణులు చెబుతారు. ఆ విశ్లేషణను క్రింది పట్టికలో చూడవచ్చు: కాడల సంఖ్య లభించే శుభ ఫలితం 2 కాడలు దాంపత్య జీవితంలో ప్రేమ, బలమైన సంబంధాలు 3 కాడలు సంతోషం, సంపద, దీర్ఘాయుష్షు 5 కాడలు ఆరోగ్యకరమైన ఎదుగుదల 8 కాడలు ఆర్థిక పురోగతి, అపార సంపద 9 కాడలు అదృష్టం, అఖండ విజయం వాస్తు ప్రకారం లక్కీ బాంబూ ఉన్న పాత్ర చుట్టూ ఎరుపు రంగు రిబ్బన్‌ను కట్టడం ఎంతో శ్రేయస్కరం. ఎందుకంటే వెదురు మొక్క చెక్క తత్వాన్ని కలిగి ఉండగా, ఎరుపు రంగు అగ్ని తత్వానికి సంకేతం. ఈ రెండింటి కలయిక జీవితంలో పంచభూతాల సమతుల్యతను తీసుకువస్తుంది. చేయకూడని పొరపాట్లు ఇవే! ఈ మొక్కను సంరక్షించేటప్పుడు కొన్ని పొరపాట్లు అస్సలు చేయకూడదు. లక్కీ బాంబూకు నేరుగా ఎండ తగిలేలా ఉంచకూడదు, వీటికి తక్కువ వెలుతురు మాత్రమే సరిపోతుంది. కుండీలోని నీరు అపరిశుభ్రంగా మారకుండా చూసుకోవాలి. వారానికి కనీసం ఒక్కసారైనా నీటిని తప్పకుండా మార్చాలి. ఇంట్లో ఎండిపోయిన లేదా దెబ్బతిన్న వెదురు మొక్కలను ఉంచకూడదు, దీనివల్ల ప్రతికూల శక్తి పెరిగే ప్రమాదం ఉంది. ఈ నియమాలను పాటిస్తూ మొక్కను సంరక్షిస్తే అది ఇంటికి అందాన్ని మాత్రమే కాక సకల శుభాలను చేకూరుస్తుంది. ఆతిబఇశ్రీజీతిఎవతీ: వాస్తు ప్రకారం లక్కీ బాంబూ ప్లాంట్ విశేషాలను తెలియజేయడమే ఈ కథనం ఉద్దేశం. దీనికి సంబంధించిన మరింత సమాచారాన్ని తెలుసుకోవడానికి వాస్తు నిపుణులను సంప్రదించాల్సి ఉంటుంది.

# ఈశాన్య మూలలో బాత్ రూమ్ ఉంటే రోగాలకు వెల్కమ్.. పరిహారాలివే!

వాస్తు శాస్త్రం ప్రకారం ఈశాన్య దిక్కు జల తత్వం వాటర్ ఎలిమెంట్ తో ముడిపడి ఉంటుంది. బాత్‌రూమ్ కూడా నీటితో సంబంధం కలిగి ఉండటం వల్ల రెండు జల శక్తులు ఘర్షణపడి సమస్యలు తలెత్తుతాయి. ఈ వాస్తు దోషం కారణంగా కుటుంబ సభ్యులు తరచుగా అనారోగ్యంతో బాధపడతారు. తలనొప్పి, జీర్ణ సమస్యలు, కిడ్నీ సంబంధిత రోగాలు, దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఈశాన్యం మూలలో బాత్ రూమ్ ఉంటే కలిగే నష్టాలివే పిల్లలు మరియు వృద్ధులు ఎక్కువగా ఆనారోగ్యంతో దెబ్బతింటారు. ధనం నిలవకుండా పోవడం, అనవసర ఖర్చులు పెరగడం, వ్యాపారాల్లో నష్టాలు, ఉద్యోగంలో అడ్డంకులు ఎదురవుతాయి. ఆర్థిక వృద్ధి మందగించి, అప్పులు పెరిగే పరిస్థితి ఏర్పడవచ్చు. దీనివలన ఇంట్లో మనశ్శాంతి దెబ్బతింటుంది. కలహాలు, ఒత్తిడి, నిద్రలేమి సాధారణమవుతాయి. పిల్లల చదువులో ఆటంకాలు, నిర్ణయాలు తీసుకోవడంలో గందరగోళం, సంబంధాల్లో విభేదాలు ఏర్పడతాయి. ఇంటి నెగిటివిటీ దీనితో ... పరిహారాలు ఇలా కొన్ని సందర్భాల్లో ఆధ్యాత్మిక ప్రగతి కూడా నిరోధించబడుతుంది. ఈ దోషం వల్ల ఇంటి మొత్తం వాతావరణం నెగెటివ్‌గా మారి, అన్ని రంగాల్లో అడ్డంకులు ఎదురవుతాయని అనుభవజ్ఞులు చెబుతున్నారు. అయితే ఈ వాస్తు దోష నివారణకు తీసుకోవాల్సిన నివారణ చర్యలు తప్పక తీసుకోవాలి. పూర్తి స్థాయిలో బాత్‌రూమ్‌ను మార్చడం సాధ్యం కాకపోతే, కొన్ని సులభమైన మరియు ప్రభావవంతమైన పరిహారాలు అనుసరించవచ్చు: సానుకూలత కోసం బాత్ రూమ్ లో ఇది పెట్టండి బాత్‌రూమ్ తలుపు ఎప్పుడూ మూసి ఉంచాలి. టాయిలెట్ సీట్ మూతను కూడా వేసి ఉంచడం చాలా ముఖ్యం. ఇది నెగెటివ్ ఎనర్జీ వ్యాప్తిని నియంత్రిస్తుంది. బాత్‌రూమ్‌లో ఒక చిన్న గిన్నెలో సముద్రపు ఉప్పు లేదా రాళ్ల ఉప్పును ఉంచండి. ప్రతి వారం ఒకసారి మార్చాలి. ఉప్పు ప్రతికూల శక్తులను గ్రహించి శుద్ధి చేస్తుంది. ఇంటికి సానుకూలతను ఇస్తుంది. బాత్ రూమ్ లో ఇలాంటి ఏర్పాట్లతో ఎనర్జీ బ్యాలెన్స్ బాత్‌రూమ్‌లో సరైన వెంటిలేషన్ ఏర్పాటు చేయాలి. సూర్యకాంతి చేరేలా చూడాలి. ఎయిర్ ప్యూరిఫైయింగ్ మొక్కలు పీస్ లిల్లీ, స్నేక్ ప్లాంట్ వంటివి ఉంచడం వల్ల ఎనర్జీ బ్యాలెన్స్ అవుతుంది. వాస్తు నిపుణుల సలహాతో వాస్తు పిరమిడ్స్, వాస్తు క్రిస్టల్స్, మిర్రర్స్ లేదా యాంటీ-క్లాక్‌వైజ్ స్వస్తిక్ చిహ్నాలు ఏర్పాటు చేయవచ్చు. ఈశాన్య దిక్కులో పీతాంబర రంగు లేదా తెలుపు రంగు ఉపయోగించడం కూడా మంచిది.



ంశ్రీబనీ ఖీవజీట ఆగ్నేయ దిక్కులో బాత్ రూమ్ ఉంటే ఏం జరుగుతుంది? తప్పదంటే ఏం చెయ్యాలి? ఇలా చేస్తే వాస్తు దోషం పోతుంది నిత్యం బాత్‌రూమ్‌ను శుభ్రంగా ఉంచడం, ధూపం వేయడం వంటి చర్యలు కూడా సహాయపడతాయి. ఈశాన్య మూలలో బాత్‌రూమ్ ఉండటం వల్ల వాస్తు దోషం ఏర్పడి ఆరోగ్యం, ధనం, మానసిక శాంతి ప్రభావితం అవుతాయి. అయితే సరైన పరిహారాలతో ఈ దోషాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

# సినిమా

## మామ సినిమాకు అల్లుడు క్లాప్

### బాలకృష్ణ 112వ చిత్రానికి లోకేశ్ కెమెరా ఆన్



రాజధాని అమరావతిలో నందమూరి నటసింహం బాలకృష్ణ 112వ చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. సినిమా ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరై.. క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్ఆన్ చేశారు. ఈ సందర్భంగా హీరో బాలకృష్ణ మాట్లాడుతూ.. సినిమా ఓపెనింగ్ కోసం వచ్చిన మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా మొదటి షాట్‌ను డైరెక్ట్ చేసిన నందమూరి తేజస్వినికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సినిమాకి క్లాప్ కొట్టి 20 సంవత్సరాలు అయ్యిందన్నారు. ఏపీలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని అన్నారు. పర్యాటక రంగం, సినీ పరిశ్రమ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని బాలయ్య తెలిపారు. సినీ ఇండస్ట్రీని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. సినిమాతో పాటు థియేటర్ ఎకనామిని ప్రోత్సహిస్తామన్నారు. ఎఐ టెక్నాలజీతో సినిమా పరిశ్రమను మరింత ఉన్నతికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సినిమాలు అమరావతి నుంచే ప్రారంభం కావాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. సినీ పరిశ్రమకు సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్టూడియోలు, రికార్డింగ్ థియేటర్లకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. త్వరలో సినీ పరిశ్రమకు చెందిన స్టూడియో కూడా రావాలని కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు బాలయ్య బాబు కోసం ఒక సినిమా రాశానని దర్శకుడు కొరటాల శివ అన్నారు. రైటర్‌గా కూడా ఒక సినిమా రాసినట్లు చెప్పారు. ఇప్పుడు బాలయ్య బాబుకు దర్శకత్వం వహించడం తన అదృష్టమని శివ చెప్పుకొచ్చారు.



## ఓజి -2 సీక్వెల్‌కు పవన్ రెడీ

### సోషల్ మీడియాలో స్పెషల్ వీడియో విడుదల




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ' బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఓజీ 2' రానున్న విషయం ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా, తాజాగా ఆ సినిమా పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం గురువారం ఒక స్పెషల్ వీడియోను సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'గంభీర కథ సిద్ధమవుతోంది. తుపాను రావడానికి ముందు నిశ్శబ్దం ఉంటుంది' అనే పవర్‌ఫుల్ క్యాప్షన్‌తో ఈ అప్‌డేట్ ఇచ్చారు. విడుదలైన వీడియోలో డైరెక్టర్ సుజీత్‌తో కలిసి పవన్ కళ్యాణ్ స్క్రిప్ట్ గురించి చర్చిస్తున్న విజువల్స్ ఉన్నాయి. చివర్లో పవన్ కళ్యాణ్ 'నేను రెడీ' అని చెప్పడం నెటిజన్లను, మెగా అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. దీంతో 'ఓజీ 2' షూటింగ్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుందని స్పష్టమవుతోంది. మొదటి భాగానికి సంగీత దర్శకుడిగా పని చేసిన థమన్ ఎస్ ఈ సీక్వెల్‌కు కూడా మ్యూజిక్ అందించనున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. 'ఓజీ' మొదటి భాగంలో చూపించిన పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ వరల్డ్‌ను ఈ సీక్వెల్‌లో మరింత పెద్ద స్థాయిలో, కొత్త కోణంలో చూపించనున్నారని టాక్. ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్, 'ఓజీ 2' కోసం డేట్స్ కేటాయించడంతో అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.




## సందీప్ కిషన్ సూపర్ సుబ్బు

టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటించిన సరికొత్త వెబ్ సిరీస్ 'సూపర్ సుబ్బు'. నెట్‌ఫ్లిక్స్ సంస్థ అందిస్తున్న మొట్టమొదటి ఒరిజినల్ తెలుగు సిరీస్ ఇదే కావడం విశేషం. తాజాగా ఈ సిరీస్ అఫీషియల్ ట్రైలర్‌ను నెట్‌ఫ్లిక్స్ ఇండియా విడుదల చేసింది. 'డీజే టిల్లు' ఫేమ్ డైరెక్టర్ మల్లిక్ రామ్ ఈ కామెడీ డ్రామా సిరీస్‌ను తెరకెక్కించారు. బాలీవుడ్ 'లిటిల్ థింగ్స్' ఫేమ్ మిథిలా పాల్కర్ ఈ సిరీస్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఒక అమాయక యువకుడు, అత్యంత సంప్రదాయ గ్రామం, అసాధ్యమైన ఓ ఉద్యోగం అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో ఈ సిరీస్ వస్తోంది. సుబ్రమణ్యం చిలుకూరి రావు అలియాస్ సుబ్బు అనే ఒక అమాయక పల్లెటూరి యువకుడికి ఎవరూ వెళ్లడానికి ఇష్టపడని 'మాకీపూర్' అనే వింత ఊరికి పోస్టింగ్ వస్తుంది. తన తండ్రి కుకటేశ్వరరావు ముందు పరువు నిలబెట్టుకోవాలని ఆ ఊరిలో అడుగుపెట్టిన సుబ్బుకి అక్కడ ఊహించని షాక్ తగులుతుంది.




దేశంలోనే అత్యధిక సంతానోత్పత్తి రేటు ఉండి, జనాభా నియంత్రణ లేని ఆ ఊరి జనాలకి మనోడు సెక్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పాఠాలు చెప్పాల్సి వస్తుంది. ఒకవైపు జాబ్ టెన్షన్స్, లవ్ ప్రాబ్లమ్స్, ఇంకోవైపు ఊరి జనాల అపార్థాల మధ్య సుబ్బు పడే ఇబ్బందులు, క్రియేట్ చేసే కామెడీతో ఈ ట్రైలర్ నవ్వులు పూయించింది. మిథిలా పాల్కర్ ఒక క్రేజీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, నటి అవ్వాలని కలలుకనే పాత్రలో కనిపించనుంది. వీరితో పాటు కామెడీ కింగ్ బ్రహ్మానందం, వర్సటైల్ యాక్టర్ మురళీ శర్మ, గెటప్ శ్రీను, జీవన్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, భరత్ లక్ష్మీపతి ఈ సిరీస్‌ను నిర్మించారు. మల్లిక్ రామ్, రమేష్ ఎలిగేటి, శివాని ధోబాల్ సంయుక్తంగా దీనికి కథను అందించారు. ఈ అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్ వెబ్ సిరీస్ జులై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.



## నా బాడీ నాష్టం అంటే..వాడి కళ్లు వాడి ఇష్టం

### స్త్రీల వేషధారణపై పరిమితులు ఉండాలన్న సునీత



ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ సునీత ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మహిళల వస్త్రధారణ, సినిమా సామాజిక బాధ్యత, మరియు సమాజంలో స్వేచ్ఛ అనే అంశాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చకు దారితీశాయి. సమాజంలో జరిగే విషయాలనే సినిమాలో చూపిస్తున్నామని మేకర్స్ చెప్పే సమాధానాన్ని సునీత తప్పుబట్టారు. కమర్షియల్ సినిమా అయినా, ఎలాంటి సినిమా అయినా సమాజం పట్ల కొంత బాధ్యత కలిగి ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే సమాజంలో సినిమాని తిడితే, సినిమాలో సమాజాన్ని తిడుతున్నారు, సమాజం అలా ఉంది కాబట్టే తాము ఇలా సినిమా తీశామని మేకర్స్ చెబుతున్నారని సునీత పేర్కొన్నారు. ఇక ఇటీవల కాలంలో బాగా వినిపిస్తున్న మై బాడీ మై రైట్ అనే స్లోగన్‌పై సునీత ప్రాక్టికల్ కోణంలో మాట్లాడారు. అమ్మాయిలు నా బాడీ నా ఇష్టం అని తమకు నచ్చిన బట్టలు వేసుకున్నప్పుడు, అవతలి వ్యక్తి చూసే చూపును కూడా వాడి కళ్ళు వాడి ఇష్టం అనాల్సి వస్తుందని, ఇందులో ఎవరినీ తప్పు పట్టలేమని అన్నారు. ఎవరి ఇష్టం వారిదని ఆమె స్పష్టం చేశారు. అయితే బట్టల పరిధిని పెంచుకోవడాన్ని లేదా తగ్గించుకోవడాన్ని తన దృష్టిలో అసలైన స్వేచ్ఛ అనరని సునీత తెలిపారు. చుట్టూ ఉన్న పరిసరాలు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయో చూసుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. కేవలం బట్టలు లేదా సిగరెట్లు తాగడం ఈక్వాలిటీ కాదని, సమాజంలో లేదా ఒక ఇంట్లో ఒక మహిళ తన అభిప్రాయాన్ని చెప్తే, దానికి పురుషులు ఎంతవరకు విలువ ఇస్తున్నారు అనే దానిపై పోరాడాలని సునీత అభిప్రాయపడ్డారు. పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై కూడా సునీత పరోక్షంగా ప్రస్తావిస్తూ ఎవరి ఒపీనియన్ వాళ్లది. ఎస్ చెప్పాలన్నా, నో చెప్పాలన్నా మన ఇష్టమే. కేవలం సినిమా ఇండస్ట్రీలోనే కాదు, నేను జనరల్ గా సొసైటీలో ఉన్న అమ్మాయిల గురించి కూడా మాట్లాడుతున్నాను. ఇక్కడ ఒక గీత గీయాలంటే, ఫుల్ స్టాప్ పెట్టాలంటే బలవంతం ఏమీ లేదు అని సునీత తెలిపారు.



Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com